

ఎంజీఎం మైదానం పరువు తీసిన వైనం.. అతి పెద్ద ఆట స్థలంలో వసతులు కరువు.. శిథిలావస్థలో ఇండోర్ స్టేడియం






కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఇండోర్ స్టేడియం

# క్రీడకు చీడ

## వైసీపీ పాలనలో క్రీడలకు ప్రోత్సాహం కరువు

**హిందూపురం అర్బన్, ఏప్రిల్ 19:** ఉమ్మడి అనంత జిల్లాలోనే హిందూపురం ఎంజీఎం ఆటల మైదానం చాలా పెద్దది. పూర్వం నుంచి ఇక్కడ క్రీడలు ఆడుతున్నారు. ఇక్కడ ఆడినవారు మేటి క్రీడాకారులుగా గుర్తింపు పొందారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. వైసీపీ అధికారం చేపట్టాక క్రీడలకు ప్రోత్సాహం మరచింది. క్రీడల గురించి పట్టించుకున్న పాపానపోలేదు. ఎంజీఎం లాంటి చారిత్రాత్మక మైదానంలోనూ వసతులు కరువయ్యాయంటే ఎంతగా నిరాదరణకు లోనయ్యాయో అర్థం చేసుకోవచ్చు. స్టేడియంలోని నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. స్టేడియం శిథిలావస్థకు చేరింది. ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. తాగుబోతులకు నిలయ

### ఎన్టీఆర్ హయాంలో ఇండోర్ స్టేడియం



హిందూపురంలో దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో ఎంజీఎం పాఠశాల ఉంది. అందులో 4 ఎకరాల మేర ఆటస్థలం క్రీడాకారులకు చాలా అనువుగా ఉంటుంది. ఇక్కడ ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బ్యాల్ బ్యాడ్మింటన్, షటిల్, హ్యాండ్‌బాల్ తదితర క్రీడలు ఆడేవారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు ఇండోర్ స్టేడియానికి శంకుస్థాపన చేశారు. తరువాత 2001లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే సీసీ వెంకటరాముడు నేతృత్వంలో అతిపెద్ద ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. అందులో వాలీబాల్, షటిల్, బాస్కెట్‌బాల్, మల్టీ గేమ్స్, జూడో తదితర క్రీడలు ఆడేవారు.

### వైసీపీ పాలనలో శిథిలావస్థకు..

వైసీపీ అధికారం చేపట్టాక క్రీడలకు ఆదరణ కరువైంది. ఇండోర్ స్టేడియం పైకప్పు దెబ్బతింది. బొక్కలు పడింది. వర్షం కురిస్తే నేరుగా ఇండోర్ స్టేడియంలోకి నీరు చేరుతోంది. మొత్తం నిండిపోతోంది. దీంతో ఆటలకు ఏమాత్రం అనువుగా లేదు. వెరసి ఫ్లోరింగ్ పాడైపోయింది. పట్టించుకునే వారు కరువయ్యారు. ఇండోర్ స్టేడియం సజ్జా గోడలు కూలిపోయి, వాటికి వినియోగించిన ఇనుపచువ్వలు బయటికొచ్చాయి. స్టేడియం కూలడానికి సిద్ధంగా ఉంది. క్రీడాకారులు అందులో ఆడాలంటే భయపడుతున్నారు. ఎవరూ ముందుకు రావడంలేదు.

### ఆగిన స్టేడియం పనులు



ఇనుపచువ్వలు కనిపిస్తున్న దృశ్యం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత క్రీడలను ప్రోత్సహిస్తూ ఎంజీఎం క్రీడా మైదానంలో రూ.2 కోట్లతో మరో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టెండర్ ప్రక్రియ ముగిసి, పనులు ప్రారంభించారు. దాదాపు సగం పనులు చేశారు. ఇంతలోనే పాలకపక్షం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఇండోర్ స్టేడియం పనులు ఆగిపోయాయి. బిల్లులు మంజూరు కాలేదు. దాదాపు రూ.70 లక్షలు బిల్లు బకాయి రాకపోవడంతో కాంట్రాక్టర్.. పనులు ఆపేశారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. టీడీపీ హయాంలో చేపట్టిన పనులు కావడంతో బిల్లులు ఇవ్వలేదని తెలుస్తోంది. వైసీపీ పాలకుల తీరుతో క్రీడలు కుంటుపడ్డాయి. వైసీపీ నిర్లక్ష్యంతో పాత ఇండోర్ స్టేడియం శిథిలావస్థకు చేరుకోగా.. కొత్తగా నిర్మాణం చేపట్టినది అర్థంతరంగా ఆగిపోయింది. దీంతో మైదానం మద్యం బాబులు, పేకాటరాయుళ్ల ఇతర అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.



స్టేడియం లోపలి భాగం



మొండిగోడలకు పరిమితమైన నూతన ఇండోర్ స్టేడియం



ఇండోర్ స్టేడియం పైకప్పునకు పడిన రంధ్రాలు



తాగి పడేసిన బీరు బాటిళ్లు

## నీటి తిప్పలు..!



పొలంలో బోరుబావి వద్ద నీరు పట్టుకుంటున్న ఇస్లాపురం వాసులు

రాయల రాజధాని పెనుకొండను నీటి కష్టాలు చుట్టుముట్టాయి. నగర పంచాయతీ పరిధి ఇస్లాపురం 1వ వార్డులో 20రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఇస్లాపురం గ్రామంలో 2 వేలకు పైగా జనాభా ఉంది. రెండు బోరుబావులు ఉండగా.. ఒకటి మరమ్మతులకు లోనైంది. మిగిలిన ఒక బోరు బావి నుంచి వచ్చే నీరు గ్రామానికంతటికీ చాలట్లేదు. దీంతో గ్రామస్థులు తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావిని ఆశ్రయించాల్సి వస్తోంది. పనులు వదులుకుని మరీ నీటి వేట సాగిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు కూడా బోరుబావుల వద్దకెళ్లి, నీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి, గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. -పెనుకొండ రూరల్

| ప్రాంతం | పుట్టపర్తి | కదిరి | ధర్మవరం | హిందూపురం | పెనుకొండ |
|---|---|---|---|---|---|
| గరిష్ఠం కనిష్ఠం | 40.0 28.0 | 39.0 28.0 | 41.0 28.0 | 38.0 26.0 | 39.0 25.0 |

# అరాచక పాలనను అంతమొందించండి

■ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కుంటిమద్ది లక్ష్మీనారాయణ



కొత్తూరు ప్రచారంలో ప్రసంగిస్తున్న కుంటిమద్ది లక్ష్మీనారాయణ

**రొద్దం, ఏప్రిల్ 19:** రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనను ప్రజలు అంతమొందించాలని రిటైర్డ్ ఐఏఎస్ కుంటిమద్ది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ప్రచారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎంతోమంది రాజకీయాల్లోకి వచ్చి సేవలందించారన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచం గుర్తించే స్థాయిలో అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో ఎన్నో అరాచకాలు జరిగాయనీ, అలాంటి ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రజలు కంకణబద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి ఉషశ్రీ తిరుగుటపా..!

ప్రచారానికి రావద్దన్న గ్రామస్థులు.. వెనుదిరిగిన వైనం

**పెనుకొండ రూరల్, ఏప్రిల్ 19:** మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీకి పార్టీ కార్యకర్తల నుంచే ఎదురుదెబ్బ తగిలింది. తమకు తెలియకుండా ఎలా వస్తారనీ, హారతులు పట్టడానికి ఎవరూ లేరంటూ గ్రామస్థులు ఫోన్‌లో నిలదీశారు. గ్రామానికి ప్రచారానికి రావద్దన్నారు. దీంతో ఖంగుతిన్న మంత్రి దారిమధ్యలోనే వెనుదిరిగారు.

పెనుకొండ నగర పంచాయతీ పరిధి కోనాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెంకటరామిరెడ్డి కోఆప్షన్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మంగాపురం, కోనాపురం, కొండాపురం గ్రామాల్లో ఆయన నాయకుడిగా చలామణి అవుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పెనుకొండ నగర పంచాయతీ కోనాపురం, మంగాపురం, కొండాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని మంత్రి ఉషశ్రీ బయల్దేరారు. ఉదయం కోనాపురం, మంగాపురం గ్రామాల్లో ప్రచారం ముగించుకుని, కొండాపురానికి బయల్దేరారు. దారిమధ్యలో గ్రామస్థుల నుంచి మంత్రికి ఫోన్ వచ్చింది. 'గ్రామంలో మీకు హారతులు ఇచ్చేవారు ఎవరూలేరు. అందరూ పనులకెళ్లారు. మాకు సమాచారం ఇవ్వకుండా గ్రామానికి ఎలా వస్తారు? మా గ్రామంలో వెంకటరామిరెడ్డి ఆధిపత్యం ఏంటి? మేమే ఒకరోజు సమయం చూసుకుని చెప్తాం. అప్పుడు వద్దురు' అంటూ గ్రామస్థులు స్పష్టం చేశారు. దీంతో ఖంగుతిన్న మంత్రి దారిమధ్యలోనే వెనుతిరిగి వెళ్లిపోయారు. కోనాపురం, మంగాపురంలో మంత్రి ప్రచారానికి జనం కరువయ్యారు. మంత్రి రోడ్‌షోకి స్పందన కరువైంది. పట్టుమని 50 మంది కూడా లేకపోవడం గమనార్హం.



మంగాపురంలో మంత్రి రోడ్‌షోకి కరువైన జనం

# బాలయ్యా.. మజాకా..!





ర్యాలీకి హాజరైన అభిమానులు, కార్యకర్తలు, ప్రజలకు బాలయ్య ప్రణామం

### అట్టహాసంగా నామినేషన్
### 20వేల మందితో భారీ ర్యాలీ
### దద్దరిల్లిన పురం

**హిందూపురం, ఏప్రిల్ 19:** పట్టణంలో ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ శుక్రవారం సందడి చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా బాలయ్య నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమం అట్టహాసంగా సాగింది. సూగూరు ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న నందమూరి బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధరాదేవి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి, అక్కడే దంపతులు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. నామినేషన్ పత్రాలను దేవుడి వద్ద ఉంచి, పూజలు చేశారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. 11.15 గంటలకు ఆర్ఓ కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ పత్రాలు పరిశీలించిన మీదట 12.10 గంటలకు ఉమ్మడి అభ్యర్థిగా నందమూరి బాలకృష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా నందమూరి వసుంధరాదేవి నామినేషన్ పత్రాలు ఆర్ఓ అభిషేక్ కుమార్‌కి అందజేశారు. వీరి వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అనిల్‌కుమార్ ఉన్నారు.

### జనమయం

హిందూపురం జనమయమైంది. జై బాలయ్య నినాదాలతో మార్మోగింది. ఎమ్మెల్యే బాలకృష్ణ సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఇందిరమ్మ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. వేలాది మంది టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టి, పూలహారాలు వేశారు.

| రెండోరోజు నామినేషన్లు ఇలా.. | |
|---|---|
| జిల్లాలో మొత్తం నామినేషన్లు | 13 |
| ఎంపీ స్థానానికి | 0 |
| అసెంబ్లీ స్థానాలకు | 13 |
| హిందూపురం | 2 |
| కదిరి | 3 |
| మడకశిర | 1 |
| పుట్టపర్తి | 4 |
| పెనుకొండ | 2 |
| ధర్మవరం | 1 |

### బాలయ్య ఆస్తులు రూ.81.63 కోట్లు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నామినేషన్ పత్రాల్లో దాఖలు చేసిన మేరకు ఆయన ఆస్తుల విలువ రూ.81.63కోట్లు. బాలకృష్ణ పేరుమీద మూడు కార్లు ఉండగా.. వీటి విలువ రూ.1.52కోట్లు. 5కిలోల వెండి, 800 గ్రాముల బంగారం, రూ.68.85లక్షల విలువచేసే వజ్రాలు ఉన్నాయి. ఆయన పేరుమీద రూ.9.09 కోట్ల అప్పులున్నాయి. నందమూరి వసుంధరాదేవి అఫిడవిట్‌లో చూపిన ఆస్తుల విలువ రూ.140,38,83,000. ఆమె పేరుమీద రూ.3.83 కోట్ల అప్పులున్నాయి. వీరి కుమారుడు మోక్షజ్ఞ ఆస్తుల విలువ రూ.58.63 కోట్లు.



కందికుంట వెంకటప్రసాద్ తరపున నామినేషన్ వేస్తున్న కందికుంట యశోదాదేవి

### కదిరిలో కందికుంట..

**కదిరి, ఏప్రిల్19:** టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కదిరి అసెంబ్లీ అభ్యర్థిగా కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణి కందికుంట యశోదాదేవి కూడా నామినేషన్ వేశారు. కందికుంట తరఫున కూడా ఆయన సతీమణి యశోదాదేవి నామినేషన్ సమర్పించారు. వైసీపీ అభ్యర్థిగా మగ్బూల్ అహమ్మద్ నామినేషన్ వేశారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న సవిత

### పెనుకొండలో సవిత..

**పెనుకొండ:** టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పెనుకొండ అసెంబ్లీ స్థానానికి సవిత నామినేషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం 12గంటలకు భర్త వెంకటేశ్వర్లు, న్యాయవాది విశ్వనాథ్, సీనియర్ నాయకుడు మాధవనాయుడుతో కలిసి సవిత.. సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్‌కు ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. ఈనెల 24న నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి మరో సెట్ నామినేషన్ దాఖలు చేస్తానన్నారు. వైసీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ కూడా ఒకసెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

### మడకశిరలో సునీల్‌కుమార్..

**మడకశిరటౌన్:** టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ సునీల్‌కుమార్ శుక్రవారం నామినేషన్ సమర్పించారు. సతీమణి సారిక, న్యాయవాది నారాయణగౌడ్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, సీనియర్ నాయకుడు ఓబులేసుతో కలిసి అభ్యర్థి సునీల్‌కుమార్.. మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్‌కు తొలిసెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు.

# వ్యయ పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి

జిల్లా ఎన్నికల వ్యయపరిశీలకుడు అమిత్‌కుమార్

**పుట్టపర్తి, ఏప్రిల్ 19:** సార్వత్రిక ఎన్నికల వ్యయ పరిశీలనను అధికారులు పారదర్శకంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్‌కుమార్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పలు విభాగాలను కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్నికల విధులు తదితర అంశాలపై కలెక్టర్ వివరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చేపట్టిన నిఘా వివరాలను కలెక్టర్ వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రోజువారీ నివేదికలు ఈఓ కార్యాలయానికి సకాలంలో చేర్చాలని సూచించారు. ప్రచారవ్యయాన్ని అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగానే పరిగణించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్, నోడల్ అధికారి వెంకటాచలపతి, ఏఓ రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయపరిశీలకుడు అమిత్‌కుమార్

పురుషులు: 1,58,445 | స్త్రీలు: 1,60,400 | మొత్తం: 3,15,845




నియోజకవర్గంలోని మండలాలు: గుంతకల్లు, గుత్తి, పామిడి

నియోజకవర్గ చరిత్ర

గుంతకల్లు నియోజకవర్గం అన్నింటా వెనుకబాటు
2009 నుంచి నియోజకవర్గ హోదా కోల్పోయిన గుత్తి
ఆసియాలో అతిపెద్ద మిల్లు.. గుంతకల్లులో ఏసీఎస్ మూత
పామిడి గార్మెంట్ పరిశ్రమకు చేయూత కరువు
తాగునీరు.. నియోజకవర్గ ప్రజల అతిపెద్ద సమస్య
స్వతంత్ర అభ్యర్థికి పట్టం.. తొలి ఎమ్మెల్యే రాజారాం



# గతమే ఘనం..

ఒకప్పుడు పరిశ్రమలతో కళకళలాడిన గుంతకల్లు నేడు ఉపాధి లేక వెలవెలబోతోంది. ఏసీఎస్ మిల్లు, సిమెంటు స్లీపర్ల తయారీ, సినిమా కటౌట్ల తయారీ, సినిమా పంపిణీ పరిశ్రమలతో కళకళలాడేది. ప్రతిసారి ఎన్నికల్లో ఏసీఎస్ మిల్లును తెరిపిస్తామని నేతలు హామీలు ఇవ్వడమే కానీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. హంద్రీనీవా కాలువ గుంతకల్లు నుంచే జిల్లాలోకి ప్రవేశిస్తున్నా, ఈనియోజకవర్గానికి ఆయకట్టును కేటాయించలేదు.

గుంతకల్లు ✍

గుంతకల్లు నియోజకవర్గం 2009కు ముందు గుత్తి పేరిట ఉండేది. గుత్తి నియోజకవర్గం 1952లో ఏర్పాటయింది. తొలి ఎన్నికలు 1955లో జరిగాయి. గుత్తి నియోజకవర్గం ఏర్పాటైనప్పుడు గుంతకల్లు రైల్వే డివిజనల్ కేంద్రంగా లేదు. గుంతకల్లు కంటే గుత్తి పెద్ద పట్టణంగా, తాలూకా కేంద్రంగా ఉండేది. అందువల్ల 1952లో గుత్తి కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. 1955లో గుంతకల్లులో రైల్వే డివిజన్ ఏర్పాటైన తర్వాత ఈ గ్రామం పట్టణంగా అభివృద్ధి చెందింది. దీంతో గుంతకల్లును నియోజకవర్గంగా గుర్తించాలంటూ వచ్చిన డిమాండ్ల మేరకు 2009లో పునర్విభజనలో భాగంగా గుత్తి నియోజకవర్గాన్ని గుంతకల్లు నియోజకవర్గంగా మార్పుచేశారు. అప్పటి నుంచి ఇప్పటికి మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో కాంగ్రెస్ నుంచి కొట్రికే మధుసూదన్, 2014లో టీడీపీ నుంచి ఆర్.జితేంద్రగౌడు, 2019లో వైసీపీ నుంచి వై. వెంకటరామిరెడ్డి గెలుపొందారు. గుత్తి నియోజకవర్గంలో సాయినాథ్‌గౌడుకు 1999లో టీడీపీ తరపున పోటీ చేసి 34,464 ఓట్ల అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. 1972లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన డి.వెంకటరెడ్డి అత్యల్ప ఓట్లతో గెలుపొందారు. గుంతకల్లు నియోజకవర్గం ఏర్పడ్డాక వై.వెంకట రామిరెడ్డి, వైసీపీ తరపున, 2019లో పోటీచేసి 48,532 ఓట్ల అత్యధిక మెజారిటీ సాధించారు. 2014లో టీడీపీ తరపున పోటీ చేసిన ఆర్.జితేంద్రగౌడు 5094 ఓట్ల అత్యల్ప మెజారిటీతో గెలిచారు. గుత్తి నియోజకవర్గంలో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ నాలుగుసార్లు విజయం సాధించింది. గుంతకల్లు నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ఒక్కోసారి గెలిచాయి.

**నియోజకవర్గ కేంద్రం మార్పు**

1952 నుంచి 2009 వరకూ ఈ నియోజకవర్గం గుత్తి కేంద్రంగా ఉండింది. 2009లో గుంతకల్లు నియోజకవర్గ కేంద్రంగా మారింది. గుత్తి చివరి ఎమ్మెల్యే ఎన్. నీలావతి, గుంతకల్లు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్.

**తొలి ఎమ్మెల్యే రాజారాం**

గుంతకల్లు నియోజకవర్గం తొలుత గుత్తి నియోజకవర్గంగా ఉండేది. తొలిసారి 1955లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎం.రాజారాం కాంగ్రెస్ పార్టీకి చెందిన సంద నారాయణప్పపై 534 ఓట్లతో గెలుపొందారు. రాజారాం ఎస్సీ (మాదిగ) సామాజికవర్గానికి చెందినవారు. ఉరవకొండ తాలూకా కొనకొండ్ల ఈయన స్వస్థలం. ఈయన గుంతకల్లుకు చేరుకుని బెంచికొట్టాల ప్రాంతంలో నివసిస్తూ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేసేవారు. తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత ఈయన కుమారుడు చంద్రశేఖర్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేశారు. ఛైర్మన్ పదవికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత ఆయన కుటుంబంలో ఎవరూ రాజకీయంగా కొనసాగలేదు.

## నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు

గుంతకల్లు పట్టణం గతంలో ఏసీఎస్ మిల్లు, సిమెంటు స్లీపర్ల తయారీ, సినిమా కటౌట్ల తయారీ, సినిమా పంపిణీ పరిశ్రమలతో కళకళలాడేది. ఉద్యోగిత ఎక్కువగా ఉన్న కారణంగా కొనుగోలు శక్తి అధికంగా ఉండేది. కానీ కాలానుగుణంగా పరిశ్రమలన్నీ మూతపడి ఉద్యోగాలు గల్లంతయ్యాయి. ఏసీఎస్ మిల్లును తెరిపిస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నా, దాన్ని ఇంత వరకూ తెరిపించలేకపోయారు. ఈ పరిశ్రమను తెరిస్తే స్థానికంగా నిరుద్యోగ సమస్య కొంత తగ్గుతుందని డిమాండు ఉంది. గుంతకల్లు పట్టణంలో రైల్వే స్టేషన్ ప్రాంతం నుంచి సరైన రహదారి లేనందున ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. హంద్రీనీవా కాలువ గుంతకల్లు నుంచే జిల్లాలోకి ప్రవేశిస్తున్నా, ఈ నియోజకవర్గానికి ఆయకట్టును కేటాయించలేదు. ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టును స్థిరీకరించాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. గుంతకల్లులో టీడీపీ హయాంలో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు పూర్తయి కొన్ని, పూర్తి కాక కొన్ని నిలిచిపోయాయి. వాటిని తెరిపించడం, పూర్తిచేయాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. హంద్రీనీవాను వెడల్పుచేసే పనులను టీడీపీ చేపట్టి 50 పూర్తిచేసింది. వాటిని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. రూ.8 వేల కోట్లతో టెండరును కూడా నిర్వహించి డబ్బు ఇవ్వకుండా, పనులను ప్రారంభించకుండా వదిలేసింది. గుత్తి, పామిడి మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ రెండు పట్టణాలకు తాగునీరందిస్తామంటూ ఎన్నికల హామీలు ఇస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. గుత్తిలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. డ్రెయిన్ల నిర్మాణం అత్యవసరం. పామిడిలో కూడా రోడ్లు, డ్రెయిన్ల సమస్య తీవ్రంగా ఉంది. పామిడిలో టెక్స్‌టైల్ పార్కు మూతపడింది. దీనిని తెరిపిస్తామంటూ వైసీపీ ఎన్నికల సమయంలో డాంభికాలు పలికింది. కానీ పట్టించుకున్నది లేదు.

**తలమానికం.. రైల్వే డివిజన్**

గుంతకల్లులో రైల్వే డివిజనల్ హెడ్‌క్వార్టర్సు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. అలాగే దేశంలోనే జిల్లా కేంద్రం కానిచోట డివిజన్ హెడ్ క్వార్టర్స్ ఉండటం కూడా ఓ ప్రత్యేకత. ఇక్కడ నివసిస్తున్న రైల్వే ఉద్యోగులలో దాదాపు పది వేల ఓట్లు కలిగి ఉన్నారు..

## నియోజకవర్గ ప్రత్యేకత

టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకూ (గుత్తి, గుంతకల్లు నియోజకవర్గాలు కలిపి) తొమ్మిదిసార్లు ఎన్నికలు జరిగాయి. అందులో ఐదుసార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ గెలుపొందాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిందో, ఆ పార్టీ అభ్యర్థే గుంతకల్లు/గుత్తి నియోజకవర్గంలో విజయం సాధించారు. ఇప్పటిదాకా టీడీపీలో జితేంద్రగౌడు తప్ప మరెవరూ వరుసగా రెండుసార్లు పార్టీ టిక్కెట్టును పొందలేదు. ఈయన 2014, 2019 సంవత్సరాల్లో వరుసగా టిక్కెట్టు సాధించారు. తొలిసారి గెలిచి, రెండోసారి ఓడిపోయారు. వెంకటరామిరెడ్డికి టిక్కెట్టు లభించడం ఇది మూడోసారి. ఇది నియోజకవర్గంలో ఏ పార్టీకైనా ఒక రికార్డు. మూడుసార్లు ఎవరూ ఒక పార్టీలో టిక్కెట్టు పొందలేకపోయారు. గాదిలింగప్ప గుత్తి నియోజకవర్గంలో 1985, 1994 సంవత్సరాల్లో, 1999లో కాంగ్రెస్ నుంచి టిక్కెట్టు సాధించారు.

**ప్రస్తుత ఓటర్ల సంఖ్య**

| మండలం | పురుషులు | స్త్రీలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| గుంతకల్లు | 72,995 | 76,330 | 57 | 1,49,382 |
| గుత్తి | 34,638 | 35,552 | 13 | 70,203 |
| పామిడి | 23,671 | 23,774 | 6 | 47,451 |
| 2024 సం. ఓటర్లు | 1,31,304 | 1,35,656 | 76 | 2,67,036 |
| 2019 సం. ఓటర్లు | 1,17,458 | 1,14,579 | 72 | 2,32,167 |

## మూతపడిన కుట్టు శిక్షణాకేంద్రం

**కుట్టుమిషన్ల తరలింపు**

**పట్టించుకోని ప్రభుత్వం**






పామిడి: పామిడి పట్టణం వస్త్ర వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగి రెండో బాంబేగా గుర్తింపు పొంది వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ.. నాణ్యమైన దుస్తులకు కేరాఫ్‌గా నిలిచింది. పట్టణ ప్రజలు దర్జీ వృత్తితో దర్జాగా జీవితం గడుపుతున్నారు. దర్జీ వృత్తికి టెక్స్‌టైల్స్ పార్కు ఎంతగానో దోహదపడుతుందని 2004 ఫిబ్రవరి 19వ తేదీన అప్పటి పశు సంవర్ధక శాఖ మంత్రి నిమ్మల కిష్టప్ప, అనంతపురం పార్లమెంట్ సభ్యుడు కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. రూ. 120 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన టెక్స్‌టైల్ పార్కును 2010 అక్టోబర్ 29వ తేదీన అప్పటి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని యువతులు, మహిళలకు కుట్టుపై శిక్షణ ఇచ్చి నైపుణ్యాన్ని సాధించి వారి స్వయం ఉపాధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలు భావించారు. 2014లో టీడీపీ హయాంలో వినియోగానికి నోచుకున్న ఈ టెక్స్‌టైల్స్ పార్కు వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా మూత పడిపోయింది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో ప్రభుత్వం ఎంతో ఘనమైన లక్ష్యంతో నిర్మించిన టెక్స్‌టైల్ పార్కు మూత పడింది. దీంతో ఎంతో మంది యువతులు శిక్షణతో పాటు స్వయం ఉపాధిని కోల్పోతున్నారు. గత ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యం.. పాలకులు పట్టించుకోక పోవడంతో ఆచరణకు నోచుకోక టెక్స్‌టైల్ పార్కు నిరుపయోగంగా మారడంపై మహిళలు, యువతులు పెదవి విరుస్తున్నారు.

| సంవత్సరం | ఎమ్మెల్యే | పార్టీ | ప్రత్యర్థి | పార్టీ | మెజారిటీ ఓట్లు |
|---|---|---|---|---|---|
| 1955 | రాజారాం | ఇండిపెండెంట్ | సంద నారాయణప్ప | కాంగ్రెస్ | 534 |
| 1962 | వీకే ఆదినారాయణ రెడ్డి | సీపీఐ | రామచంద్రగౌడు | ఇండిపెండెంట్ | 1,463 |
| 1967 | రామచంద్రగౌడు | ఇండిపెండెంట్ | తక్కెళ్లపల్లి పాపాసాహెబ్ | కాంగ్రెస్ | 4,349 |
| 1972 | డి. వెంకట రెడ్డి | ఇండిపెండెంట్ | ఆర్. సుల్తాన్ | కాంగ్రెస్ | 471 |
| 1978 | కె. వెంకటరామయ్య | కాంగ్రెస్ | జాఫర్‌సాబ్ | జనతాపార్టీ | 6,241 |
| 1983 | పత్తి రాజగోపాల్ | టీడీపీ | వెంకటరామయ్య | కాంగ్రెస్ | 26,552 |
| 1985 | ఎన్. గాదిలింగప్ప | టీడీపీ | అరికెరి జగదీశ్ | కాంగ్రెస్ | 4,467 |
| 1989 | అరికెరి జగదీశ్ | కాంగ్రెస్ | సాయినాథ్ గౌడు | టీడీపీ | 1,613 |
| 1994 | ఎన్. గాదిలింగప్ప | టీడీపీ | సాయినాథ్ గౌడు | ఇండిపెండెంట్ | 10,778 |
| 1999 | సాయినాథ్ గౌడు | టీడీపీ | ఎన్.గాది లింగప్ప | కాంగ్రెస్ | 34,464 |
| 2004 | ఎన్. నీలావతి | కాంగ్రెస్ | కేసీ నారాయణ | టీడీపీ | 8,712 |
| | | 2009లో గుంతకల్లు నియోజకవర్గ ఆవిర్భావం | | | |
| 2009 | కె. మధుసూదన్ గుప్త | కాంగ్రెస్ | సాయినాథ్‌గౌడు | టీడీపీ | 9,344 |
| 2014 | ఆర్. జితేంద్రగౌడు | టీడీపీ | వెంకటరామిరెడ్డి | వైసీపీ | 5,094 |
| 2019 | వై. వెంకట రామిరెడ్డి | వైసీపీ | జితేంద్రగౌడు | టీడీపీ | 48,532 |

# విప్లవజ్యోతి తరిమెల

**యుక్తవయసులోనే మార్క్సిజం వైపు అడుగులు**

**ప్రజానేతగా బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కృషి**




తరిమెల నాగిరెడ్డి

అనంతపురం కల్చరల్ ✍

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేరెన్నికగల కమ్యూనిస్టు నాయకుల్లో తరిమెల నాగిరెడ్డి ఒకరు. ఈయన అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో రైతుకుటుంబంలో 1917 ఫిబ్రవరి 11న జన్మించాడు. తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, నాగలక్ష్మమ్మ. పాఠశాల రోజుల నుంచే సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా తిరుగబడే లక్షణాలను నాగిరెడ్డి కనబర్చాడు. యుక్తవయసులోనే వివేకానందుడు, రామకృష్ణ పరమహంస, గాంధీ ప్రభావం నుంచి మార్క్సిజం వైపు ఆకర్షితులై పీడిత ప్రజలకోసం నిరంతరం తపించాడు. 1940లో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజుల్లో 'యుద్ధం - ఆర్థిక ప్రభావం' అన్న రచనతో అందరినీ ఆలోచింపజేశారు. అయితే ఈ పుస్తకం రాసినందుకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ ఆగ్రహానికి గురై జైలుకు వెళ్లాడు. తిరుచిరాపల్లి జైలు నుంచి విడుదలవగానే మరలా 1941లో భారతీయ రక్షణ చట్టం కింద అరెస్టయ్యాడు. 1946లో ప్రకాశం ఆర్డినెన్సు కింద అరెస్టయ్యి 1947లో విడుదలయ్యారు.

### బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికే జీవితం అంకితం

1952లో నాగిరెడ్డి మద్రాసు శాసనసభకు సీపీఐ అభ్యర్థిగా అనంతపురం నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యాడు. జైలులో ఉండికూడా ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, తన బావ అయిన నీలం సంజీవరెడ్డిపై విజయం సాధించి సంచలనం సృష్టించాడు. 1955లో కొత్తగా ఏర్పడిన పుట్లూరు నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీచేసి తరిమెల రామచంద్రారెడ్డి చేతిలో ఓడిపోయాడు. 1957లో అనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2వ లోక్‌సభకు ఎన్నికయ్యాడు. తిరిగి 1962లో పుట్లూరు నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు సీపీఐ అభ్యర్థిగా పోటీచేసి తరిమెల రామచంద్రారెడ్డిని ఓడించి ఎన్నికయ్యాడు. 1967లో నియోజకవర్గాల పునర్విభజనలో పుట్లూరు నియోజకవర్గం రద్దు కాగా... సీపీఐ(ఎం) అభ్యర్థిగా అనంతపురం నియోజకవర్గం నుంచి మూడో పర్యాయం శాసనసభకు ఎన్నికయ్యారు. 1968 మార్చి నెలలో శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1969లో నాగిరెడ్డి సీపీఐ(ఎం) నుంచి విడిపోయి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్టు రెవల్యూషనరీస్(ఏపీసీసీఆర్) - ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వయ కమిటీని స్థాపించాడు. సీపీఐ(ఎం) కార్యకర్తలను కొత్తపార్టీలోకి ఆకర్షించడంలో సఫలమయ్యాడు. 1976లో మరణించేదాకా ఏపీసీసీఆర్ నాయకుడిగా కొనసాగిన నాగిరెడ్డి ప్రజలకు నిరుపమాన సేవలందించారు. తన జీవితాన్ని అణగారిన, బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధికే ఆయన అంకితం చేసి, ప్రజా ఆప్తబంధువుగా నిలిచారు. నాగిరెడ్డి 1976 జూలై 28న మరణించాడు.



రిషివ్యాలీ స్కూల్‌లో సహచరులతో..



తాడిపత్రి బహిరంగ సభలో నీలం సంజీవరెడ్డితో తరిమెల నాగిరెడ్డి

### విజ్ఞాన రుషి.. వీకే



వీకే ఆదినారాయణరెడ్డి

బహుముఖ ప్రజ్ఞాశాలిగా కమ్యూనిస్టు ఉద్యమానికి సేవలందించిన ధన్యజీవి కామ్రేడ్ వీకే ఆదినారాయణరెడ్డి. ఈయన 1917 అక్టోబరు 8న చీమలవాగుపల్లి గ్రామంలో సంపన్న రైతు కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశ నుంచే జాతీయ భావాలవైపు ఆకర్షితుల య్యారు. విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. 1943 నాటికి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. పార్టీ నిర్ణయం మేరకు వ్యవసాయ కార్మిక పోరాటాలు నిర్వహించారు. చీమలవాగుపల్లె, తరిమెల గ్రామాల్లో కూలీల పోరాటాలకు ఈయన నాయకత్వం వహించారు. 1952 ఎన్నికల తర్వాత పార్టీ నిర్ణయం మేరకు వీకే తన నివాసాన్ని గుంతకల్లుకు మార్చారు. రైల్వే కార్మికులను సంఘటితం చేయడం, స్థానిక గూండాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడటం అక్కడ నిత్యకృత్యం అయింది. ఈ క్రమంలోనే గుత్తి, గుంతకల్లు రైల్వే కార్మికుల్లో కమ్యూనిస్టు పార్టీని నిర్మించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో గుత్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు విశేషంగా కృషి చేశారు. జిల్లా కరువు, నీటి పారుదల అంశాలపై ఆయనకు ఎంతో పట్టు ఉండేది. జిల్లాలో కరువు శాశ్వత నివారణకు జీవితకాలం తపించారు. రాయలసీమ అభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించిన జ్ఞాని. నీటి ప్రాజెక్టులతోపాటు పరిశ్రమలు కావాలని జిల్లాలో ఉన్న భూగర్భ ఖనిజ సంపద ఆధారంగా వాటిని నిర్మించాలని అధికారులను, ప్రభుత్వాలను తరచూ డిమాండ్ చేసేవారు. తుదిశ్వాస విడిచేవరకూ ప్రభుత్వాలపై నిర్మాణాత్మక విమర్శలు చేశారంటే అతిశయోక్తి కాదు.

## కోటయ్యా..! నీవే దిక్కు

**ఎన్నికలు ఏవైనా కాటకోటేశ్వరుడి కరుణ కోసం అభ్యర్థుల క్యూ**

తాడిమర్రి ✍



ఎన్నికలు ఏవైనా అభ్యర్థులు కాటకోటేశ్వరుడి దీవెనల కోసం క్యూకడతారు. మండలంలోని చిల్లవారిపల్లిలో ఈ క్షేత్రం ఉంది. ధర్మవరం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉన్న ఏకైక పుణ్య క్షేత్రం కావడంతో అభ్యర్థులు ఇక్కడి నుంచే తమ ప్రచారం ప్రారంభిస్తుంటారు. చాలామంది అభ్యర్థులు స్వామిని దర్శించుకుని పూజలు చేసిన తర్వాతే నామినేషన్లు, ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తుంటారు. ఇప్పటికే కూటమి తరపున పోటీ చేస్తున్న సత్యకుమార్ కాటకోటేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ గ్రామం నుంచి ప్రచారం ప్రారంభిస్తే అంతా మంచే జరుగుతుందని వివిధ పార్టీల నాయకుల నమ్మకం.

## ఇచ్చింది గోరంతే..

ధర్మవరం ✍



ఐదేళ్ల కాలంలో జగన్ ఏ ఒక్క పథకం మాకు ఇవ్వలేదు. నేతన్న నేస్తం కూడా మాలాంటి వాళ్లకు దక్కలేదు. సొంత మగ్గాలుంటేనే ఆ పథకం వర్తిస్తోంది. కూలి మగ్గం నేసుకునే వారికి మాత్రం పైసా దక్కలేదు. గోరంత ఇచ్చి కొండంతా లాగేసుకున్నారు. సీఎం జగన్ ధర్మవరం వచ్చినప్పుడు చేనేతలకు న్యాయం చేస్తానని, పెద్ద పెద్ద మార్కెట్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లు అవుతున్న మాలాంటివాళ్లను పట్టించుకున్నదే లేదు. చేనేత సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటి గురించి పట్టించుకునే వారేలేరు. ఇంత అన్యాయమైన ప్రభుత్వాన్ని నేనెప్పుడు చూడలేదు.

## మా పార్టీకి ఓటేయకపోయారో..?

**వృద్ధులు, దివ్యాంగులకు వైసీపీ బెదిరింపు**

కొత్తచెరువు ✍



వృద్ధులు, దివ్యాంగుల ఓట్లకు వైసీపీ గాలం వేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటు వేసే సదుపాయం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో వారి ఓట్లను కొల్లగొట్టడానికి క్షేత్రస్థాయిలో గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడుపుతోంది. వైసీపీ నాయకులు వలంటీర్లతో కలిసి రాత్రి సమయాల్లో వారి వద్దకు వెళ్లి వచ్చే ఎన్నికలలో వైసీపీకి ఓటు వేయాలని ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఇన్నేళ్లుగా మేమే మీకు ఇళ్ల వద్దకు పింఛన్ ఇచ్చాం. మళ్లీ కూడా వైసీపీ ప్రభుత్వమే వస్తుంది. మీరు మా పార్టీకి ఓటు వేయకపోతే తర్వాత మీకు పింఛన్ ఇవ్వము అని బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 85 ఏళ్లపైబడిన వృద్ధులు77,228 మంది, దివ్యాంగులు 18,095 మంది ఉన్నారు. వీరిని ఇప్పటికే ఆయా బీఎల్‌ఓలు గుర్తించారు.

## ఇంటి నుంచే నామినేషన్

**సువిధ యాప్‌తో అవకాశం**

ఉరవకొండ ✍

ఎన్నికల ప్రక్రియను సులభతరం చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఈక్రమంలోనే లోక్ సభ, శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇంటి నుంచే నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం ఎన్నికల సంఘం సువిధ.ఈసీఐ.గవర్నమెంట్.ఇన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ నెల 25వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థులు నేరుగా వచ్చి ఆర్వోకు సమర్పించడం లేదా ఆన్‌లైన్ ద్వారా అందించే వీలు ఉంటుంది. ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లో కమిషన్ సూచించిన వివరాలు నమోదు చేసి, ధ్రువపత్రాలు జతచేయాలి. ఆస్తుల వివరాలు, అఫిడవిట్ పత్రాలు, నామినేషన్ బలపరిచేందుకు ఐదుగురి వివరాలు నమోదు చేయాలి. అవసరమైన పత్రాలు సమర్పించిన తర్వాత వాటిని ప్రింట్ తీసి నామినేషన్ దాఖలుకు స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సమర్పించిన పత్రాలతో మూడు సెట్లు ఎన్నికల అధికారిని కలిసి గడువులోగా అందజేయాలి. నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు సమయంలో అభ్యర్థులు అందుబాటులో లేకుంటే వారి మద్దతుదారులు హాజరుకావచ్చు.

## పొద్దుగూకినా అంతే..!

**అక్కాజంపల్లిలో అమలుకు నోచుకోని హామీలు**



బ్రిడ్జి నిర్మిస్తానన్నది ఇక్కడే..

పామిడి ✍

పొద్దు గూకినా(వైసీపీ ప్రభుత్వ కాలపరిమితి పూర్తయినా) 2019లో సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిసారీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు పుల్లేటి వంక వంతెన, తారురోడ్డు నిర్మించాలని గ్రామస్థులు తెలియజేయడం పరిపాటిగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో అక్కాజంపల్లికి మట్టిరోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. టీడీపీ హయాంలో ఎదురూరు వరకూ తారురోడ్డు నిర్మించారు. ఈసారైనా ప్రజాప్రతినిధులు పుల్లేటివంకలో వంతెనను, తారురోడ్డు నిర్మించాలని కోరుతున్నాము.

## ఊరి కోసం ఓటు..!

**అప్పట్లో గ్రామ సమస్యలే ముఖ్యం**

గార్లదిన్నె ✍



సి నాగిరెడ్డి

అప్పట్లో ఎన్నికల ప్రచారం ఇంత హడావుడిగా ఉండేది కాదు. గ్రామాలకు ప్రచారానికి వెళ్లే అభ్యర్థులు కూడా తమ వాహనాలను ఊరి బయటే ఉంచి నడుచుకుంటూ వచ్చేవారు. ఊర్లోల్లోని పెద్ద మనుషులతో మాట్లాడి గ్రామసమస్యలు తెలుసుకుని, గెలిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవారు. గ్రామ పెద్దలు కూడా తమ స్వార్థం కోసం కాకుండా ఊరికి ఉపయోగపడే పనులనే అభ్యర్థులను చేయమని అడిగేవారు. ఈక్రమంలో గ్రామ పెద్దల మాట మీద గ్రామస్థులందరూ వారు చెప్పినవారికి ఓటేసేవారు. ఇప్పుడు ఓ స్థాయి నాయకుడు గ్రామానికి వచ్చినా డప్పులు, పూలదండలు పూలు చల్లుకుంటు ఆర్భాటాలు చేస్తున్నారు. ఓటేయమంటే 'నాకేంటి' అని ముఖం మీదే అడుగుతున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఇంటికి ఇద్దరు, ముగ్గురు నాయకులు తయారయ్యారు. దీంతో రాజకీయం అంటే విలువ లేకుండా పోయింది.

## 70 మంది వలంటీర్ల రాజీనామా

నార్పల: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన 70 మంది వలంటీర్ల రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ రాముడు శుక్రవారం తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసమే వీరంతా రాజీనామా చేసినట్లు సమాచారం.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
అనంతపురం
శ్రీ సత్యసాయి
శనివారం 20 ఏప్రిల్ 2024



## కూటమి మహా ఉప్పెన

### నందమూరి బాలకృష్ణ

**హిందూపురం, ఏప్రిల్ 19:** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మహా ఉప్పెన అంటూ హిందూపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ శుక్రవారం అన్నారు. నామినేషన్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు పార్టీల కూటమిని తట్టుకునే శక్తి ఎవరికీ లేదన్నారు. హిందూపురం ప్రజలు ఎన్టీఆర్‌ని మూడు సార్లు గెలిపించారు. నియోజకవర్గం ప్రజలంతా మా కుటుంబ సభ్యులే. వారు మా కుటుంబాన్ని తమ గుండెల్లో పెట్టుకున్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని నాన్న గారి మాటను స్ఫూర్తిని తీసుకొని రెండు సార్లు గెలిచానన్నారు. సొంత నిధులతో సేవ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అన్న క్యాంటిన్ తొలగించినా రోజూ 400 మందికి భోజనం పెడుతున్నట్లు వెల్లడించారు. వైసీపీ పాలనలో అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. ఎన్టీఆర్ పారిశ్రామిక వాడ తీసుకువస్తే చంద్రబాబు పరిశ్రమలు తీసుకువచ్చారని కితాబునిచ్చారు. తాను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఈ నియోజకవర్గాన్ని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా అన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడానికి ప్రజలు మూడోసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

## పీకిపారేస్తాం..!

వలంటీర్లకు ఎంఎల్ఓ బెదిరింపులు

**విడపనకల్లు, ఏప్రిల్ 19:** 'మండలంలోని ప్రతి గ్రామం లోని వలంటీర్లు రాజీనామా చేయాలి. అలా చేయనివారిని ప్రభుత్వం వచ్చాక తొలగిస్తాం' అంటూ ఎంఎల్ఓ కుళ్లాయప్ప మండల వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపాడు. మండల వలంటీర్లు అందరూ రాజీనామా చేయాలని, రాజీనామా చేసినంత మాత్రాన వారిని తొలగించినట్లు కాదని, ప్రభుత్వం వచ్చిన వెంటనే వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని పేర్కొన్నారు. పై నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని అందుకే అందరూ రాజీనామా చేయాలని తెలిపారు. ఇప్పటికే హావళిగి గ్రామంలోను, ఇతర గ్రామాల్లోను వలంటీర్లందరూ రాజీనామా చేశారు. మిగిలినవారు కూడా రాజీనామా చేసి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రాజీనామాలు చేయకపోతే రాబోవు రోజుల్లో ఇబ్బంది పడతారని హెచ్చరించారు. దీనిపై పలువురు వలంటీర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఈపొద్దే రాజీనామా చేయల్ల..

**శింగనమల:** ఏమప్పా..! మన మండలంలో ఉండే వలంటీర్లంతా శనివారంలోపల రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనాల. మన పార్టీ అభ్యర్థిని గెలిపించాల' అని శింగనమల మండల వైసీపీ నాయకుడు వలంటీర్లుకు హుకు జారీ చేశారు. శుక్రవారం శింగనమలలో గ్రామ వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆ నాయకుడు మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి వలంటీర్లుగా ఉన్న వాళ్లంతా ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు అడ్డు వస్తాయి కాబట్టి శనివారంలోపు వలంటీర్లందరూ రాజీనామాలు చేయాలని ఆదేశించారు. వచ్చే రెండు నెలలకు జీతాలు ఇప్పిస్తామన్నారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే కాబట్టి మళ్లా మిమ్మల్నే వలంటీర్లుగా నియమిస్తామన్నారు. రాజీనామాకు ఒప్పుకోనివారితో బలవంతంగానైనా చేయించాలని గ్రామ వైసీపీ నాయకులకు బాధ్యతలు అప్పజెప్పారు.

# ప్రచారంలో పెనుమార్పులు


ఇటీవల కదిరిలో ఎన్నికల ప్రచారానికి హెలికాప్టర్‌లో వచ్చిన నందమూరి బాలకృష్ణ

కాలి నడక నుంచి హెలికాప్టర్ దాకా..
పల్లెల్లో వాహనాల బారులు
ఆకాశ మార్గంలో ప్రముఖులు
తప్పెట స్థానంలో డీజే
చెట్ల నీడ నుంచి షామియానాల్లోకి..

ఎన్నికల ప్రచారంలో నాటికి నేటికి ఎన్నో మార్పులు వచ్చాయి. కాలినడక నుంచి ఆకాశ మార్గంలో వచ్చేస్థాయికి పరిస్థితులు మారిపోయాయి. ఒకప్పుడు పల్లెలకు నాయకులు జీపుల్లో వచ్చి ఓట్లడిగేవారు. ఇప్పుడు ఆర్భాటాలు పెరిగిపోయాయి. ఒక పల్లెలో ఉన్న ఓటర్ల కంటే అభ్యర్థి వెంట వచ్చే అనుచరగణమే అధికంగా ఉంటోంది. కనీసం అభ్యర్థి ముఖం కూడా చూడడానికి వీలులేకుండా వారే చుట్టూ హడావుడి చేస్తుంటారు. ప్రచారం లో తప్పెట్ల స్థానంలో డీజేలు వచ్చాయి. ప్రతి అభ్యర్థి తన ఘనతను చాటుకుంటూ సొంతంగా పాటలు తయారు చేయించుకుని తన డప్పు తనే కొట్టుకునే స్థాయిలో ప్రచార హోరు కనిపిస్తోంది.

**హిందూపురం, ఏప్రిల్ 19:** ఎన్నికల ప్రచారంలో ప్రతిసారి విన్నూత్న మార్పులు కనిపిస్తున్నాయి. నాడు అభ్యర్థులు కాలి నడకన గ్రామాలను తిప్పేసేవారు. మైళ్ల దూరం నడిచి ప్రజలను కలిసే వారు. ఆ తరువాత ఎడ్ల బండ్లు, సైకిళ్లు, మహా అయితే జీపుల్లో అభ్యర్థులు తిరిగి ప్రచారం చేపట్టేవారు. రానురాను జీపుల వినియోగం పెరిగింది. ఆ తరువాత అంబాసిడర్ కార్లు వచ్చాయి. ఆ తరువాత నాయకులు ఖరీదైన కార్లు, ఇతర వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు రిక్షా బండిపై మైకు కట్టుకొని అభ్యర్థులు వెళ్లేవారు. కానీ నేడు డీజేలు, మరిన్ని అత్యాధునిక పరికరాలు ఉపయోగిస్తున్నారు. ఇటీవల వాహనాల వినియోగం పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగా ప్రచారం సమయంలో కూడా అభ్యర్థులు అధిక సంఖ్యలో వాహనాలు ఉపయోగిస్తున్నారు. ఇటీవల పెనుకొండ నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఏకంగా వంద వాహనాలతో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఎక్కడ అభ్యర్థి ప్రచారానికి వెళ్లినా పదుల సంఖ్యలో వాహనాలు కనిపిస్తున్నాయి. వారితో పాటు ముఖ్య అనుచరులు, నాయకులు అధిక సంఖ్యలో వాహనాలతో వెళ్లి తమ బలాన్ని చూపుతున్నారు.

### ఆకాశ మార్గాన ప్రముఖులు

పార్టీ అధ్యక్షులు, ప్రముఖులు సభలకు హెలిక్యాప్టర్లు వినియోగిస్తున్నారు. వందల కిలోమీటర్ల దూరంలో సభలు ఉంటే సమయానికి చేరుకోవడానికి వీలు ఉండదు. దీంతో తక్కువ సమయంలో సభలకు హాజరుకావడానికి హెలిక్యాప్టర్లు వినియోగిస్తున్నారు. ఒకప్పుడు ఎంత పెద్ద సభ అయినా వాహనాల్లో వెళ్లేవారు. నేడు నిమిషాల్లో ఆకాశ మార్గాన సభల ముందు వాలిపోతున్నారు.

### చెట్ల నీడపోయి షామియానా వచ్చె..

దేశంలో ఎన్నికలు వచ్చిన తొలినాళ్లలో చెట్ల కింద సభలు, సమావేశాలు నిర్వహించేవారు. పల్లెల్లో అయితే ఊరు మధ్యలో చెట్ల నీడన అరుగు కట్టల వద్దకు అందరిని తీసుకువచ్చి ఓటు అడిగేవారు. చెట్ల నీడనే సభలను ఏర్పాటు చేసుకునేవారు. నేతల ప్రసంగాలు నేలపై కూర్చొని వినేవారు. మారిన కాలానుగుణంగా సభలు సమావేశాలు నిర్వహించాలంటే పెద్ద పెద్ద మైదానాల్లో షామియానాలు, టెంట్లు వేసి ఓటర్లకు కూడా కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. మరీ జనం తక్కువగా ఉంటే కల్యాణ మండపాల్లో, నగరాల్లో అయితే ఏసీ ఉన్న ఫంక్షన్ హాళ్లలో సభలు నిర్వహిస్తున్నారు. అప్పట్లో పగలు మాత్రమే సభలు నిర్వహించేవారు. ఇప్పుడు రాత్రి సమయంలో కూడా ఎల్ఈడీ దీపాలు వేసి సభలు నిర్వహిస్తున్నారు.

### ప్రచారంలో పాటల సందడి

ఒకప్పుడు పల్లెల్లో అభ్యర్థి ప్రచారం చేసుకునే సమయంలో తప్పెట్లు కొడుతూ వెంట ఉన్న వారిని ఉత్తేజపరిచేవారు. కానీ ఇప్పుడు కొత్త కొత్త ప్రచార పాటలను రూపొందించి ప్రజల్లో ఉత్సాహాన్ని తీసుకువస్తున్నారు. అప్పట్లో ప్రతి పార్టీకి కళాకారుల బృందం ఉండేది. అభ్యర్థి సభాప్రాంగణానికి చేరుకునే ముందుగానే కళాకారులు చేరుకొని వారి నృత్యాలతో ప్రజలను ఉత్సాహపరిచేవారు. ఇప్పుడు రికార్డింగ్ పాటలతో పట్టణాల్లో పల్లెల్లో వీధుల్లో తిప్పుతున్నారు. అభ్యర్థి సేవలు, చేసిన అభివృద్ధి పనులపై పాటలను రూపొందించి హోరెత్తిస్తున్నారు. కొందరైతే ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా నేతల ప్రసంగాలను వినిపిస్తున్నారు. ఇలా ప్రచార శైలిలో విన్నూత్న మార్పులు వచ్చాయి.

## తోపుదుర్తి అనుచరుల హల్‌చల్

యథేచ్ఛగా 144 సెక్షన్ ఉల్లంఘన
చోద్యం చూసిన పోలీసులు

**రాప్తాడు, ఏప్రిల్ 19:** స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనుచరులు నామినేషన్ (తహసీల్దార్ ) కార్యాలయం వద్ద 144 సెక్షన్ నిబంధనలను ఉల్లంఘించారు. నామినేషన్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను ఎక్కువ మంది దాటుకుని వెళ్లి తమ అధికార దర్పాన్ని చూపారు. అడ్డుకోవాల్సిన పోలీసులు అధికార పార్టీ వారిని ఏమి అనకుండా స్వామి భక్తిని చూపారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరపున నామినేషన్ వేసేందుకు ఆయన తల్లిదండ్రులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ప్రేమకుమారి, సోదరులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ శుక్రవారం తమ అనుచరులతో కలిసి వచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆ ప్రదేశంలో 144 సెక్షన్ అమలులో ఉంది. నిబంధనల మేరకు నామినేషన్ దాఖలు చేసేందుకు ఐదుగురు మాత్రమే వెళ్లాలి. అందుకు విరుద్ధంగా సుమారు 100 మంది బారికేడ్లు దాటుకుని వెళ్లారు. వైసీపీ కార్యాలయం వైపు నుంచి కొందరు, పోలీస్ స్టేషన్ వైపు నుంచి కొందరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కొందరు వచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కార్యాలయం ఆవరణ నుంచి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిని గేటు వేసి మూసివేశారు. వైసీపీ నాయకులు వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి గేటు తాళాలు తీయించి నామినేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. నామినేషన్ కార్యాలయం గేటు వద్ద కూడా 10 మంది లోపలికి వెళ్లారు. సీకే పల్లి తహసీల్దార్ ఐదుగురి కంటే ఎక్కువ లోపలికి వెళ్లకూడదని చెప్పినా ఏడుగురు వెళ్లి నామినేషన్ వేశారు. ప్రకాష్‌రెడ్డి తరపున ఆయన తల్లి ప్రేమకుమారి నామినేషన్ సమర్పించారు. నామినేషన్ కేంద్రం నుంచి బయటకు వచ్చాక 144 సెక్షన్ అమలులో ఉన్న స్థలంలో వైసీపీ శ్రేణులతో కలిసి గుంపులుగా ఫొటోలు దిగారు. ఈ సంఘటనపై రాప్తాడు సీఐ మునిస్వామి మాట్లాడుతూ బారికేడ్లు దాటి ఐదుగురి కంటే ఎక్కువ మంది వెళ్లకూడదన్నారు.


రాప్తాడులో 144 సెక్షన్ అమలులో ఉన్న స్థలంలో గుంపులు, గుంపులుగా ఉన్న వైసీపీ శ్రేణులు

**పుట్టపర్తి, ఏప్రిల్ 19:** బుక్కపట్నం చెరువు ముంపు రైతులకు పరిహారం ఇపిస్తానని చేతిలో చెయ్యి వేసి చెప్పి ఓట్లు వేయించుకున్నాడు. గట్టెక్కిన తర్వాత మరిచిపోయాడని పలువురు బాధితులు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సమస్యలను రైతు లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికలు ముగిసిన ఆరునెలల్లోపు ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం ఇప్పిస్తానని నమ్మబలికారు. అయితే ఏళ్లు గడుస్తున్నా పైసా పరిహారం రాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఇప్పించలేకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగను అని అప్పట్లో ధీమాగా హామీ ఇచ్చారు. ఇప్పుడు మళ్లా ఏ ముఖం పెట్టుకుని ఓట్లడిగేకి వస్తాడో చూస్తామంటూ బాధితులు పేర్కొంటున్నారు.

## ఏ ముఖంతో ఓట్లడుగుతాడో చూస్తాం

ఎమ్మెల్యేపై బుక్కపట్నం చెరువు ముంపు బాధితుల ఆగ్రహం
దుద్దుకుంట హ్యాండిచ్చారంటున్న బాధితులు


నీటమునిగి ఎండిన మామిడిచెట్లు

- చెరువు పరిధిలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలకు చెందిన 450 మంది రైతులకు 465 ఎకరాల భూమి ఉంది. చెరువులో నీరు లేనప్పుడు రైతులు పంటలు సాగు చేసేవారు. చెరువును కృష్ణజలాలను నింపడంతో రైతులు ఉపాధి కోల్పోయారు. టీడీపీ హయాంలో రెండు సార్లు కృష్ణాజలాలతో బుక్కపట్నం చెరువును నింపారు. ముంపు రైతులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇందు కోసం ప్రతిపాదనలు సైతం ప్రభుత్వానికి పంపారు. అయితే 2019లో ఎన్నికలు రావడం వైసీపీ గెలవడంతో అవి మూలనపడ్డాయి.

### మామిడిచెట్లు ఎండిపోయాయి



బాగా నిండుగా కాపు కాస్తున్న 300 మామిడిచెట్లు నీట మునిగి ఎండిపోయాయి. దీంతో లక్షల రూపాయలు నష్టపోయా. పశుగ్రాసం సైతం నీటమునిగిపోవడంతో పాడిపశువులు కూడా అమ్ముకున్నా. కడుపునింపుతున్న భూములు నీట మునగడంతో బతుకుతెరువును కోల్పోయాం. ప్రభుత్వాలు మారిన పరిహారం రాలేదు. మా బతుకులు మారలేదు.

- హరి, రైతు, జానకంపల్లి


### చేతిలో చేయి వేసి చెప్పాడు



మున్సిపల్ ఎన్నికలలో మా ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చెరువు ముంపు భూముల గురించి చెప్పగానే చేతిలో చేయి వేసి ఆరు నెలలోగా పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. ఏళ్లు గడిచిన హామీ నెరవేరలేదు.

-కరణం భువనేశ్వర్, రైతు, పుట్టపర్తి

బుక్కపట్నం చెరువు



### ఉపాధి కోల్పోయా..

ఉన్న నాలుగెకరాల భూమిలో వేరుశనగ, వరీ మొక్కజొన్న పంటలు సాగుచేసేవాళ్లం. భూమినీటితో మునగడంతో ఐదేళ్లగా పంట లేదు, తినడానికి గింజలులేవు. పరిహారం ఇస్తామన్నారు. మాట మరచిపోయారు.

- భీమనేని కిష్టప్ప, రైతు, పుట్టపర్తి

## ఓ చెంబుకథ !

అత్యాశకు పోతే రూ.45లక్షలు పోయింది

**కదిరి, ఏప్రిల్ 19:** అత్యాశ ఎంతటి మనిషినైనా మోసపోయేలా చేస్తుంది. ఇందుకు మంచి ఉదాహరణే ఈ చెంబు కథ. ఇందులో బాధితుడు ఈ ఎన్నికల్లో ప్రజాప్రతినిధిగా గెలవడానికి ఉవ్విళ్లూరుతున్న వ్యక్తి కావడం గమనార్హం. ఓమండలస్థాయి నాయకుడికి రైస్‌పుల్లింగ్, చెంబుల వ్యాపారం చేసి ప్రజలను మోసం చేసే అలవాటుంది. ఇన్నిరోజులు కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణాల్లో చెంబుపేరు చెప్పి పలువురుని మోసం చేసినట్లు సమాచారం. ఈక్రమంలో మోసం చేయడానికి ఈసారి కదిరిలోని ఓ రాజకీయనాయకున్ని ఎన్నుకున్నాడు. అన్నా నాకు చెంబువ్యాపారం వచ్చింది రూ.మూడుకోట్లు ఇస్తారు. ఇప్పుడు అర్జంటుగా రూ.40 లక్షలు కావాలి. ఈ డబ్బు వారిచ్చే రూ. మూడుకోట్లలో పట్టుకోండి అంటూ నమ్మబలికాడు. ఆ నాయకుడు అత్యాశతో రూ.40లక్షలు ఇచ్చేశాడు. ఈతరువాత మరో రూ.5లక్షలు కావాలని చెబితే అదికూడా ఇచ్చినట్లు సమాచారం. రోజులు గడుస్తున్నా కోట్ల డబ్బు ఖాతాలో పడకపోవడంతో, ఆ రాజకీయనాయకుడికి అనుమానం మొదలైంది. దీంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని మండల నాయకుడిని అడిగాడు. అతను మాత్రం ఇదిగో అదిగో అంటూ కాలం గడిపేశాడు. చివరకు ఫోన్ కూడా ఎత్తకపోవడంతో ఆ నాయకుడు ఓ పోలీసు ఉన్నతాధికారిని సంప్రదించినట్లు సమాచారం. ఆయన ఈవ్యవహారాన్ని గుట్టు చప్పుడుకాకుండా పరిష్కరించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద అత్యాశకుపోయి రూ.45లక్షలు పోగొట్టుకున్న రాజకీయనాయకుడి పరిస్థితి తేలుకుట్టిన దొంగలా ఉందని తెలిసింది.

## అధిక ఖర్చులపై ఫిర్యాదు చేయండి

**అనంతపురం టౌన్, ఏప్రిల్ 19:** ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు నిబంధనల మేరకే ఖర్చులు పెట్టాల్సి ఉంటుందని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి. షిండే తెలిపారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి ఫిర్యాదులను ఫోన్‌లో తెలపాలన్నారు. అనంతపురం పార్లమెంటుకు సంబంధించి కేంద్ర వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే ఫోన్‌నెంబరు (9408794122), రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాలకు సంబంధించి వ్యయపరిశీలకులు నితీష్‌అగర్వాల్ ఫోన్‌నెంబరు(8247832873) అనంతపురం అర్బన్, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు సంబంధించి వ్యయ పరిశీలకులు రందాస్ టీ.కాలే ఫోన్‌నెంబరు(80745 08600) నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని షిండే తెలిపారు. అలాగే ఏ ఫిర్యాదునైనా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 08554-234122, 08554-239822, 08554-231722, సెక్టోరియల్ మానటరింగ్ కోసం 08554-232922, 63009 07233 నెంబర్లకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టరు వినోద్‌కుమార్ కూడా తెలిపారు.

## మేం ఓటేస్తాం.. మీరూ వేయండి

ఓటు చైతన్యంపై కేంద్ర ఎన్నికల పరిశీలకుడు, కలెక్టర్ సంతకాలు


సంతకం పెడుతున్న విలాస్ వి. షిండే

**అనంతపురం టౌన్, ఏప్రిల్ 19:** 'ఓటు విలువ ఎంతో గొప్పది.. మనకోసం పనిచేసే మంచి వ్యక్తులను ఎన్నుకోవడానికి ఈ ఓటు వజ్రాయుధం.. అలాంటి ఓటు ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి' అని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు.. ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఓటు చైతన్యంపై నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమాలలో భాగంగా కలెక్టరేట్‌లో భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల పరిశీలకులు విలాస్ వి. షిండే, నితిన్ అగర్వాల్, రందాస్ టి. కాలేతోపాటు కలెక్టర్ వినోద్‌కుమార్, కొత్తగా వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తదితరులు 'మేం ఓటేస్తున్నాం.. మీరూ నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయండి' అని కోరుతూ సంతకాలు చేశారు.

## తారు పోయింది.. మట్టి మిగిలింది

అధ్వానంగా గాండ్లపెంట-ఎన్పీకుంట రోడ్డు



**నంబులపూలకుంట, ఏప్రిల్ 19:** ప్రతిపక్షనేతగా జగన్ మోహన్‌రెడ్డి కదిరి- ఎన్పీకుంట ప్రధాన రహదారి మీదుగా పాదయాత్ర కొనసాగించారు. అప్పట్లో తారురోడ్డు ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు చేస్తామని ఉన్న రోడ్డును విచ్చలవిడిగా తొలగించారు. కల్వర్టు అరకొరగా పూర్తి చేశారు. వాటిపైన మట్టి వేశారు. డబుల్‌రోడ్డు అంటూ ఒకవైపు గుంతలు తవ్వారు. మరోవైపు, కంకర పరిచారు. సంవత్సరాలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. కదిరినుంచి గాండ్లపెంట, ఎన్పీకుంట, అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు 32కిలోమీటర్ల వరకు ఈరోడ్డు పరిస్థితి అలాగే ఉంది. గతంలో 40 నిమిషాల్లో గమ్యస్థానాలు చేరుకునేవారు. ప్రస్తుతం రెండుగంటల సమయం ఇబ్బందికరంగా ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. తిరుమలకు ఈరహదారి గుండా వెళితే తక్కువ సమయంతోపాటు చార్జీలు తగ్గుతాయని చాలామంది భావిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఈరహదారి గుండా వెళ్లడానికి ప్రయాణికులు మొగ్గు చూపడంలేదు.

ధనియాన్ చెరువు ఆంజనేయస్వామి ఆలయం ఎగుడుదిగుడుగా ఉన్నమట్టి రోడ్డు

## మా టైం వచ్చింది..!

జగన్‌కు రాజకీయ నిరుద్యోగి పోస్టు ఇస్తాం
తెలంగాణ పరిస్థితే ఆంధ్రాలో కూడా..
ఐదేళ్లలో కేవలం 368 పోస్టులతో నోటిఫికేషనా?
డీఎస్సీపైనే తొలి సంతకం అని బాబు చెప్పారు
స్టడీ పార్కులో 'ఆంధ్రజ్యోతి'తో నిరుద్యోగులు
టీడీపీ కూటమి వైపు నిరుద్యోగులు

**అనంతపురం విద్య, ఏప్రిల్ 19:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఈ ఎన్నికల తర్వాత రాజకీయ నిరుద్యోగం తప్పదని నిరుద్యోగులంటున్నారు. వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ఐదేళ్లలో ఏనాడు ఉద్యోగాల భర్తీపై ఆయన పెదవి విప్పలేదని, ఎన్నికల వేళ అరకొర పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చాడని వారు మండిపడుతున్నారు. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి జిల్లాలో కేవలం 368 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి దగా చేశాడని నిరుద్యోగులు ఫైర్ అవుతున్నారు. టెట్, డీఎస్సీకి మధ్య గడువు ఇవ్వకపోవడంతో అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. తర్వాత ఎన్నికల కోడ్ వల్ల డీఎస్సీ మూలన పడటంపై ఉద్యోగార్థులు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల స్టంట్ నడిపిన జగన్‌కు....ఎన్నికల్లో తామేంటో బుద్ధి చెబుతాం అంటూ నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు. అనంతపురం 2వ రోడ్డులోని స్టడీ పార్కులో 'ఆంధ్రజ్యోతి' పలువురు నిరుద్యోగులను పలకరించగా జగన్ పాలన, ఉద్యోగాల భర్తీపై ఇలా స్పందించారు.


పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు

**ఆంధ్రజ్యోతి:** ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జగన్ ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంది..?

**నిరుద్యోగులు :** గతంలో ఎన్నికల ముందు జగన్ సుమారు 23 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ అన్నారు. ఓట్లు దండుకుని సీట్లో కూర్చోగానే స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు తగ్గిస్తూ వచ్చారు. ఈ ఐదేళ్ల స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ లేవన్నట్టుగా లెక్కలు చూపారు. తీరా ఎన్నికలు వచ్చినప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ గుర్తుకు రావడం వింతగా ఉంది. ఈ ప్రభుత్వ వైఖరిని, విధానాలను ఈ ఐదేళ్లూ నిరుద్యోగులు చాలా గమనించారు.

**ఆంధ్రజ్యోతి :** డీఎస్సీ-2024 పట్ల మీరు సంతృప్తిగా ఉన్నారా..?

**నిరుద్యోగులు:** ఎన్నికల వెళ్లే ముందు హడావుడిగా ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే..ఎలా..? నోటిఫికేషన్ ఇచ్చారనుకుంటే....మరీ ఎన్నడూ లేని విధంగా కేవలం 368 పోస్టులు ఇచ్చారు. దాంట్లో ఎస్‌జీటీ పోస్టులు 107, స్కూల్ అసిస్టెంట్ 164, టీజీటీ పోస్టులు 115 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ఇంత దారుణమైన డీఎస్సీ నోటిఫికేషన్ మా జీవితాల్లో చూడలేదే. ఈ పోస్టులు, ఈ డీఎస్సీపై ఎవరూ సంతృప్తిగా లేరు.

**ఆంధ్రజ్యోతి :** జగన్ ఇచ్చిన పోస్టులు సరితాయా..?

**నిరుద్యోగులు :** గత ఐదేళ్లలో సుమారు 40 వేల మందికిపైగా డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తుంటారు. ప్రభుత్వం ప్రస్తుతం నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులు ఏమాత్రం సరిపోవు. కొందరు నాలుగు ఏళ్ల నుంచి మరి కొందరు ఆరేళ్లు, ఏడేళ్లుగా కష్టపడి చవుతున్నారు. ఎలాగైనా పోస్టులు కొట్టాలని ప్రిపేర్ అవుతుంటే...ఈ ఐదేళ్లూ ఆడుకున్న ప్రభుత్వం తీరా దిగిపోయే ముందు బోటాబోటీ పోస్టుల భర్తీకి దిగడంపై ప్రతి నిరుద్యోగి అసంతృప్తిగానే ఉన్నారు.

**ఆంధ్రజ్యోతి:** టెట్, డీఎస్సీ ఒకేసారి వదిలారు కదా ఇబ్బంది లేదా?

**నిరుద్యోగులు :** టెట్, డీఎస్సీకి మధ్య కనీసం 45 రోజుల సమయం ఉండాలి. కానీ ఒకే నెలలోనే టెట్, డీఎస్సీ అంటే ఎలా కుదురుతుంది. ఇలా బుద్ధి లేకుండా ఎవరైనా ఇస్తారా..? ఆ పోస్టులు నిరుద్యోగులతో భర్తీ చేయడానికా...? లేక మేము నోటిఫికేషన్ ఇచ్చాం అని జగన్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోడానికా....? ఆ పోస్టులు, నోటిఫికేషన్ చూస్తే...కడుపు రగిలిపోతోంది.

**ఆంధ్రజ్యోతి :** మాది సంక్షేమ ప్రభుత్వం, ప్రజా పాలన అంటూ వైసీపీ చెప్పుకుంటోంది. దీన్ని మీరెలా చూస్తారు...?

**నిరుద్యోగులు :** సంక్షేమం అంటే బటన్ నొక్కి.. ఈ తోడు, ఆతోడు కింద రూ. 10వేలు వేయడం, అమ్మఒడి అంటూ రూ. 13వేలు వేయడమా? సంక్షేమంలో నిరుద్యోగులు ఉండరా..? వాళ్ల సంక్షేమం పట్టదా..?, రాత్రింబవళ్లు ఉద్యోగాల కోసం చదువుకునేవాళ్లకు సంక్షేమం అక్కరలేదా?, జగన్‌కు నిరుద్యోగుల బాధలు, జీవితాలు కనపడవా?

**ఆంధ్రజ్యోతి:** వచ్చే ఎన్నికల్లో మీరెటువైపు ?

**నిరుద్యోగులు:** ఈ ఐదేళ్లలో పాలన చూశాం. కడుపు మండుతోంది. ఏపీలో మాదిరే నిరుద్యోగులు, ఉద్యోగులతో ఆడుకున్న అధికార బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో కూలిపోయింది. మాకు జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన డీఎస్సీపై నమ్మకం లేదు. ఇప్పటికే చంద్రబాబు మెగా డీఎస్సీపైనే తొలి సంతకం అని అన్నారు. టీడీపీ కూటమిదే గెలుపు. నిరుద్యోగులను చులకనగా చూసిన జగన్‌ను రాజకీయ నిరుద్యోగి మారుస్తాం. ఓటేసే రోజు వస్తుందిగా... ఆ రోజు చెబుతాం.

## నేడు తాగునీటి సరఫరా బంద్

**ధర్మవరం, ఏప్రిల్ 19:** ధర్మవరం పట్టణంలో శనివారం తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తంబాపురం వాటర్‌వర్క్స్‌లో, సుబ్బారావు పేట వద్ద పైపులైన్ల లీకేజీ వల్ల నీరు వృథాగాపోతోందన్నారు. ఆ పైపులకు మరమ్మతులు చేపట్టనుండడంతో నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## టీడీపీతోనే గిరిజనులకు న్యాయం

**నల్లమాడ, ఏప్రిల్ 19:** టీడీపీకి గిరిజన విద్యార్థి హక్కుల పోరాట సమాఖ్య రాయసీమ అధ్యక్షుడు ఆర్ మధునాయక్ మద్దతు ఇస్తామని శుక్రవారం ఓప్రటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే గిరిజనులకు న్యాయం జరిగిందన్నారు. గిరిజనులందరూ టీడీపీకి మద్దతుగా పనిచేస్తామన్నారు. టీడీపీ పాలనలో గిరిజనులకు 25 సంక్షేమ పథకాలు అమలు చేశారని, వైసీపీ అధికారంలోకి రాగానే వాటిని తొలగించిందని అన్నారు. సమాఖ్య అధ్యక్షులు రాంప్రసాద్‌నాయక్ పిలుపు మేరకు టీడీపీకి మద్దతు ప్రకటించామని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్‌కు మండల కన్వీనర్ రాజీనామా

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 19:** కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులుతోపాటు మరికొంత మంది శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి బాలాజీమనోహర్‌కు పంపినట్లు వారు తెలిపారు. కన్వీనర్‌తోపాటు నాయకులు కిష్టప్ప, గోవిందరెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లనే తాము కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దాం

**కొత్తచెరువు, ఏప్రిల్ 19:** సార్వత్రిక ఎన్నికలలో కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి గెలుపే ధ్యేయంగా అందరం పని చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. మండలంలో మైలసముద్రంలో శుక్రవారం జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు సమావేశమై విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమను కూడా తీసుకొచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇలాంటి పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కూటమి పార్టీల శ్రేణులందరూ శాయశక్తులా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దారపనేని ఉపేంద్ర, పూలశివప్రసాద్, శేషాద్రినాయుడు, దివ్యతేజ, కిలారి శ్రీనాథ్, రామానాయుడు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 19:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో కలెక్టర్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు, నిబంధనలు చేపట్టినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ వాహనాలను 100 మీటర్ల దూరంలో నిలిపివేయాలన్నారు. అభ్యర్థితో పాటు ఐదుగురికి మాత్రమే కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని చెప్పారు.

## అడవిపంది దాడిలో ముగ్గురికి గాయాలు

**ధర్మవరం, ఏప్రిల్ 19:** అడవిపంది దాడిలో పట్టణానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... చిన్నూరు నుంచి అడవిపంది ధర్మవరం పట్టణంలోకి వచ్చింది. మొదట బోయవీధిలో కరెంటుపోవడంతో బయట కూర్చొని ఉన్న భార్యభర్త నాగేంద్ర, నాగమణిలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. అనంతరం యాదవవీధికి చెందిన ఆఫ్రీన్ కూడా ఇంటి బయట ఉండగా అడవిపంది దాడి చేసి గాయపరిచింది. గాయపడిన వారిని కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అడవిపంది ప్రభుత్వాస్పత్రి ఆవరణలోకి దూకినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆవరణమంతా వెతికినా కనిపించలేదని సిబ్బంది తెలిపారు.

## శేషవాహనంపై ఊరేగిన శ్రీవారు



శేషవాహనంపై ఉత్సవమూర్తులు

**తాడిమర్రి, ఏప్రిల్19:** మండలకేంద్రంలో లక్ష్మీతార మచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అర్చకులు స్వామి వారి ఉత్సవ మూర్తిని నాగశేషవాహనంపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 23వ తేదీన బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

# టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం: కందికుంట



మైనార్టీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట



బొంతలపల్లిలో టీడీపీలోకి చేరిన వారితో కందికుంట

**కదిరిఅర్బన్, ఏప్రిల్ 19:** మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని షాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ ఏర్పాటు చేసిన మైనార్టీల ఆత్మీయ సమావేశంలో కందికుంట పాల్గొని మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి కృషి చేసింది టీడీపీనేనన్నారు. రంజాన్‌తోఫా, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం, మసీదుల మరమ్మతులకునిధులు, పెళ్లికానుక, విదేశీ విద్య, షాదీఖానాల నిర్మాణం లాంటి అనేక కార్యక్రమాలు టీ డీపీ పాలనలోనే జరిగాయన్నారు. జగన్ పాలనలో మైనార్టీలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి అధికారంలోకి రాగానే మైనార్టీ పథకాలు మళ్లీ కొనసాగుతాయని పేర్కొన్నారు. అనంతరం స్థానిక 10వార్డుకుచెందిన వైసీపీ మైనార్టీ నాయకులు టీడీపీలోకి చేరారు. వీరికి కందికుంట కదువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో సయ్యద్‌మౌలాలి, ఫిరోజ్, రహీమ్, షాజహాన్, జునైద్, షామీర్‌బాషా, ఆయిషా, నూర్జహాన్‌తోపాటు పదిమంది ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఎస్. బాహుద్దీన్, ఖాదర్‌బాషా, డైమండ్ ఇర్ఫాన్, ఫయాజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మదమెక్కి మాట్లాడుతున్న పెద్దిరెడ్డి..

**తనకల్లు:** రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మదమెక్కి మాట్లాడుతున్నారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని బొంతలపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి కదిరి, రాయచోటి రోడ్డు నిర్మాణం ఎం దుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఇప్పుడేమో వైసీపీకి ఓటు వేస్తేనే రోడ్డు వేస్తామనడం ఆయన అహంకానికి నిదర్శనమన్నారు. మీపెత్తనం చెలాయించడానికి ఇది పుంగనూరు కాదన్నారు. గతంలో ప్రజలు పొరపాటుగా వైసీపీకి ఓటు వేసి మోసపోయారన్నారు. అలాంటి పొరపాటు మరోమారు చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం బొంతలపల్లి పంచాయతీలో వివిధ గ్రామాల నుంచి 150 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారందరూ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారిలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోపాల్‌రెడ్డి, వేమనారాయణ, జక్కల సుబ్బరాం, చంద్రశేఖర్, శంకర్‌రెడ్డి, రాళ్లపల్లి బాషా, బత్తల గంగంరాజు, సూరి, రమణ, సిద్ధారెడ్డి తదతరులు ఉన్నారు. ప్రత్యేకించి దళితవాడకు చెందిన యువకులు అధిక సంఖ్యలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, శంకర్‌నాయుడు, కోటిరెడ్డి, తోట సరోజమ్మ, ప్రవీణ్‌కుమార్, జనసేన నాయకుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

**తనకల్లు:** మండలంలోని చీకటిమానుపల్లి, పడమటవారిపల్లి, కురవతాతన్నగారిపల్లి గ్రామాల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయనకు గ్రామాల్లో ప్రజలు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. కందికుంట ఇంటింటా తిరిగి ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తూ.. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. చంద్రబాబు సీఎం అయితే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. తాను గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిష్టప్ప, బాగేపల్లి చలపతి, దినకర్ ప్రసాద్‌నాయుడు, రమణప్ప, కిశోర్, ఎంపీటీసీ సభ్యుడు మాధవరెడ్డి, సర్పంచ్ రామాంజులమ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### టీడీపీలోకి చేరికలు

**నంబులపూలకుంట:** మండల కేంద్రంలో 20కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ లోకి చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్‌పీకుంటకు వచ్చారు. దీంతో ఆయన సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేరినవారిలో వాటర్‌షెడ్ మాజీ చైర్మన్ శివారెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాసులు, కల్యాణ్, రామాంజులు, హస్సన్ బాషా, అంజనేయులు తదితరులు ఉన్నారు.

# పల్లె కుటుంబం విస్తృత ప్రచారం



జగరాజుపల్లిలో పల్లె సింధూర ఎన్నికల ప్రచారం



అగ్రహారంలో ఎన్నికల ప్రచారంలో పల్లె రఘునాథరెడ్డి

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 19:** నియోజకవర్గంలో పల్లె కుటుంబీకులు శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి పంచాయతీ మార్లపల్లిలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రచారం చేపట్టారు. గ్రామంలోకి రాగానే ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం వారు ఇంటింటా తిరిగి ప్రజలను పలకరిస్తూ.. సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పల్లె సింధూర మాట్లాడుతూ కూ టమి అధికారంలోకి వస్తే పుట్టపర్తి నియోజకవర్గానికి అం తర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామన్నారు. నియోజకవర్గంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధే కనపడుతోందన్నారు. వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. సీఎం జగన్ పూర్తిగా మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి మాట తప్పారని అన్నారు. ఆయనకు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు లేదన్నారు. మాట తప్పిన జగన్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజల్ని కోరారు. తర్వాత పల్లె రఘు నాథ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ రైతుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి వస్తే రైతులకు పంటసాయం కింద ఏడాదికి రూ. 20వేలు ఇస్తామని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరను, హిందూపురం పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీరామిరెడ్డి, పుల్లప్ప, బొమ్మయ్య, శ్రీరాం నాయక్, నాగరాజు, మెహరాలి, కప్పలబండ రోశయ్య, మురారి, బద్రి, శ్యామల, సుజాతబాయితో జనసేన, బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**బుక్కపట్నం:** మండలంలోని అగ్రహారం, కొత్తకోట, గ్రామాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ముందుగా టీడీపీ సీనియర్ నాయకులు వారాదప్ప, లక్ష్మీనారాయణ, శంకర్ ఇళ్లవద్దకు వెళ్లి వారిని అప్యాయంగా పలకరించి కూటమి విజ యానికి పని చేయాలని కోరారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థ సారధిని గెలిపించాలని కోరారు. పిల్లల భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అ వసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు వస్తే కియ లాంటి అంతర్జాతీయ పరిశ్రమలు వస్తాయని, పిల్లలకు ఉద్యోగవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, బాలు, బొట్టు కిష్టప్ప, గంగాధర్, అంజి కార్యకర్తలు పాల్గొన్నారు.



పులగంపల్లిలో కృష్ణకిశోర్‌రెడ్డి ప్రచారం

### పులగంపల్లి పంచాయతీలో పల్లె కిశోర్ ప్రచారం

**నల్లమాడ:** మండలంలోని పులగంపల్లి పంచాయతీలో పులగంపల్లి, బొగ్గిటవారిపల్లి, కాయలవాండ్లపల్లి, ఎర్రచెరువుపల్లి టీడీపీ యువనేత పల్లె కృష్ణకిశోర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని గెలిపించాలని ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంచుతూ వాటి ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. పులగంపల్లి బస్టాండ్ కూడలిలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ సారైనా ప్రజలు అప్రమత్తంగా ఉండి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు అశోక్‌ఖాన్, వెంకటరమణనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్లు



కుణుతూరులో ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్‌అసిస్టెంట్ రాజు, వలంటీర్ ప్రమీల



ప్రచారంలో ఎమ్మెల్యేతో ఫొటో దిగుతున్న వలంటీర్ దీప

**ధర్మవరంరూరల్, ఏప్రిల్19:** మండలంలోని కుణుతూరు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో అదేగ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ రాజు, వలంటీర్లు ప్రమీల, దీప పాల్గొని ఎమ్మెల్యేతో ఫొటో దిగారు. అదే విధంగా మరో వలంటీర్ లత ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే వస్తున్నారని ప్రచారానికి రావాలని ప్రజలకు సూచించింది. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, గ్రామ, వార్డు వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా కొంతమంది ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు.

**గాండ్లపెంట:** మండలంలోని వద్దిరెడ్డిపల్లిలో శుక్రవారం వైసీపీ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామవలంటీర్లు పాల్గొన్నారు. ఎన్నికల కమిషనర్ నిబంధనలు ప్రకారం వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారాల్లో పాల్గొనకూడదు. అయితే నిబంధనలు తుంగలో తొక్కి వలంటీర్లు వైసీపీ ప్రచార కరపత్రాలను ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. వలంటీర్లు విజయలక్ష్మి, కృష్ణవేణి, వీణ, కల్పన, సుమియా, షకీల, జయప్రకాష్‌రెడ్డి ప్రచారం చేశారు. వంటీర్లపై ఎన్నికలాధికారులకు పిర్యాదు చేస్తామని కూటమి నాయకులు పేర్కొన్నారు.



వద్దిరెడ్డిపల్లిలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు

# సత్యకుమార్ ముమ్మర ప్రచారం



సత్యకుమార్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న ఎస్ బ్రాహ్మణపల్లె ప్రజలు

**ముదిగుబ్బ, ఏప్రిల్ 19:** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనకు ఆయా గ్రామాల్లో విశేష స్పందన లభించింది. మండలంలోని వలిమచెర్లోపల్లి, సంకేపల్లి, బండ్లపల్లి కొట్టాల, గాండ్లవారిపల్లి, ఎస్ బ్రాహ్మణపల్లి, ఏబీ పల్లి తండా, నాగలగుబ్బల, నక్కలపల్లి, దొరిగల్లు, ఇందుకూరు, మర్తాడు, దామానుపల్లి, బండ్లపల్లి, ఈదులపల్లి గ్రామాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అలాగే సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అభ్యర్థించారు. తాను ఈ నియోజకవర్గానికి కొత్త అయినా ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని తెలిపారు. ఇది ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ఈ పల్లెల్లో ఉన్న నీరు, రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యల్ని అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించి తాగు నీరు సరఫరా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### బీజేపీలోకి 40 కుటుంబాల చేరిక

**ముదిగుబ్బ:** మండలంలోని ఎస్ బ్రాహ్మణపల్లి గ్రామంలో 40 కుటుంబాల వారు వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. ప్రచారం నిమిత్తం గ్రామంలోకి వచ్చిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సత్యకుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని, ప్రతి ఒక్కరు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.



వైసీపీ శ్రేణులను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సత్యకుమార్

# సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

**ధర్మవరం, ఏప్రిల్ 19:** పట్టణంలోని 29,30,31,32వ వార్డులలో శుక్రవారం టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే వాటిని వెంటనే అమలు చేస్తారని తెలిపారు. కమలం గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసార్థని గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు కమతం కాటమయ్య, పరిశేసుధాకర్, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, కరెంటు ఆది, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరంరూరల్:** మండలంలోని ఓబుళనాయునిపల్లి, తండా గ్రామాల్లో టీడీపీ, బీజేపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా తిరిగి నిర్వహించారు. కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌లను ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు. నాయకులు మేకలరామాంజినేయులు, భాస్కర్‌చౌదరి, సూర్యనారాయణ, రాయుడు, ఆదినారాయణ, రవి, శేఖర్, అశోక్‌రెడ్డి, నాని, క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి:** మండలకేంద్రంలో మారుతీనగర్, విజయ చౌదరి కాలనీలలో టీడీపీ,బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వస్తే పథకాలు అమలవుతాయన్నారు. ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చల్లాశ్రీనివాసులు,జక్కంపూటి నాగభూషణం, తాళ్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**ఓబుళదేవరచెరువు:** మండలంలోని డబురువారిపల్లి పంచాయతీ కుసుమవారిపల్లిలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపిటి ఆంజనప్ప పార్టీ శ్రేణులతో కలిసి సూపర్ సిక్స్‌పథకాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, జయరామిరెడ్డి, రాకేష్, చిన్నప్పయ్య, సూరి, ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం

**మడకశిర రూరల్, ఏప్రిల్ 19:** మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో వెలసిన నీలకంఠే శ్వర స్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. వేదపండితులు ఆలయంలోని స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగారు. రథోత్సవం ఎదుట మహిళలు కోలాటం ఆడారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొని ఎంతో ఉత్సహంగా కోలాటం ఆడారు. రథోత్సవంలో రఘువీరారెడ్డి దంపతులు, కు టుంబ సభ్యులు పాల్గొన్నారు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

**కొత్తచెరువు, ఏప్రిల్ 19:** మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బుక్కపట్నం దేవేంద్ర, నరేశ్ ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. మండలకేంద్రంలో శుక్రవారం టీడీపీ పార్లమెంట్ అధికారప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు సమక్షంలో చేరారు. వారికి శ్రీనివాసులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 19:** అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అగ్నిమాపకశాఖాధికారి నాగరాజు నాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి జిల్లాకేంద్రంలోని సత్యసాయి సూపర్ హాస్పిటల్ సిబ్బందికి, ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే ఎలా అప్రమత్తతతో ఉండాలో, మంటలను ఎలా ఆర్పాలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయి సూపర్ హాస్పిటల్ చీఫ్ ఇంజనీర్ హరినాథ్, మెడికల్ ఆఫీసర్ జ్యోత్స్న, సీహెచ్ఓ నగేష్, జిల్లా సహాయ అగ్నిమాపకశాఖాధికారి మహ్మద్ సాదిక్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



## వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరిక

● పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన చంద్రబాబు



చంద్రబాబుకు చేనేతమగ్గం నమూనాను అందజేస్తున్న చందారాఘవ తదితరులు

**ధర్మవరం, ఏప్రిల్ 19:** పట్టణానికి చెందిన చేనేత వ్యాపారి, వైసీపీ నాయకుడు చందారాఘవ తన అనుచరులతో కలిసి శుక్రవారం టీడీపీలోకి చేరారు. రాయదుర్గానికి విచ్చేసిన అధినేత చంద్రబాబును నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో కలిసి పార్టీలోకి చేరారు. ఆయనతో పాటు చందారవి, దాసరి నర్సి, జింకా పురుషోత్తం, చందులతో పాటు వంద మంది కలిసి చంద్రబాబును కలిసి చేనేత మగ్గం నమూనాను అందజేసి టీడీపీలోకి చేరారు. వీరికి చంద్రబాబు కండువాలు వేసి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ విజయానికి కృషిచేయాలని, పార్టీకి కష్టపడి పనిచేస్తే తగిన ప్రాధాన్యత ఉంటుందని చంద్రబాబు సూచించినట్టు చందారాఘవ తెలిపారు.

## జనసేనలోకి 60 కుటుంబాల చేరిక



జనసేనలో చేరిన వారితో పత్తి చంద్రశేఖర్

**ఓబుళదేవర చెరు వు, ఏప్రిల్ 19:** మండ లంలోని తంగేడుకుంట పంచాయతీ మద్దకవారి పల్లిలో 60కుటుంబాల వారు శుక్రవారం వైసీపీ ని వీడి జనసేనలోకి చే రారు. జనసేన మండల అధ్యక్షుడు మేకల ఈశ్వ ర్ ఆధ్వర్యంలో, నియోజక వర్గ ఇన్‌చార్జి పత్తి చంద్ర శేఖర్ సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో వార్డు సభ్యులు లక్ష్మీపతి, బీ. లక్ష్మీపతి, రామమోహన్, మద్దక బాలచంద్ర, మద్దక అశోక్, ధనుంజయ్, పవన్, మురళి,అనిల్, పవన్‌కల్యాణ్, తరుణ్, కుమార్, విష్ణువర్ధన్‌తేజ, భానుచంద్ర, నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్, రంజిత్ తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా పత్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కూటమి అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పర్యటించి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి గెలుపునకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రాజశేఖర్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పరిటాల శ్రీరామ్

**బత్తలపల్లి, ఏప్రిల్ 19:** మండలంలో డీ చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కోనంకి రమణ, కోనంకి లోకేష్, కోనంకి బాలచంద్ర నాయుడు శుక్రవారం టీడీపీలోకి చేరారు. అనంతపురంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను కలిసి అయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పరిటాల శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మడకశిర టౌన్, ఏప్రిల్ 19:** మండల పరిధిలోని వలు 132 కేవీ సబ్ స్టేషన్‌కు సంబంధించి గొల్లపల్లి లైన్ అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈ సుబ్రహ్మణ్యప్రసాద్ తెలిపారు. మడకశిర, నీలకంఠాపురం, కల్లుమర్రి, ఆర్ అనంతపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## వలంటీర్ల రాజీనామా

**మడకశిరటౌన్, ఏప్రిల్ 19:** అమరాపురం మండలంలోని హేమావతి గ్రామ సచివాలయం 1, 2 ల పరిధిలో 11 మంది వలంటీర్లు రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందించామన్నారు. వలంటీర్లు రాజు, హేమాంత్, అమూల్య, సౌమ్య, శివలింగప్ప, రంగస్వామి, సుమిత్ర, అంజలి, రాజు, శివరాజు, ప్రభాకర్ తదితరులు రాజీనామా చేసినట్లు స్వయంగా హేమావతి సచివాలయంలో ప్రకటించారు.

**గోరంట్ల:** మేజర్ పంచాయతీ గోరంట్ల పరిధిలోని 30మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు రాజీనామా పత్రాలు అందించారు. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలో 140మంది వలంటీర్లు ఉండగా, ఇప్పటివరకు 54మంది రాజీనామా చేశారు. అలాగే మండల వ్యాప్తంగా 222 మంది వలంటీర్లు విధుల నుంచి వైదొలగినట్లు అధికారులు తెలిపారు.

## ఉజ్జయిని మహంకాళికి పంచమజ్యోతుల సమర్పణ

**హిందూపురం అర్బన్, ఏప్రిల్ 19:** తెలుగుదేశం పార్టీ హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మూడో సారి అఖండ మెజారిటీతో గెలవాలని హిందూపురం ముద్దిరెడ్డిపల్లికి చెందిన వేయిమంది ఉజ్జయినిలోని మహంకాళి అమ్మవారికి పంచమజ్యోతులు సమర్పించారు. బాలయ్యశుక్రవారం నామినేషన్ వేసిన సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ భజనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం అన్నదానం చేశారు. వచ్చేనెలలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బాలయ్య అఖండ మెజారిటీతో గెలవాలని ఉజ్జయిని మహంకాళికి పంచమ జ్యోతులు సమర్పించినట్లు ముద్దిరెడ్డిపల్లి చౌడమ్మ దేవాలయం ధర్మకర్త బండారు బాలాజీ ఫోన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మీనాగరాజ్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## 22న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

**పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఏప్రిల్ 19:** మండలకేంద్రమైన పరిగిలో ఈ నెల 22న మాదిగల ఆత్మీయసమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ దళిత నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వారు శుక్రవారం సోమందేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవ్యాప్తంగా ఉన్న మాదిగలతో పరిగి మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగ కులస్థులందరూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశులు, కిష్టప్ప, మాగేచెరువు సర్పంచ్ నరసింహులు, సూర్యనారాయణ, నాగరాజు, మూర్తి, సంజయ్, హనుమంతు, కదిరప్ప, సజ్జరాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'మడకశిర పిలుస్తోంది..'

**రొళ్ల, ఏప్రిల్ 19:** మండలంలోని కే గొల్లహట్టి గ్రామం నుంచి పిల్లిగుండ్లు గ్రామం వరకు శనివారం 'మళ్లీ మడకశిర పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాకర్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## పావగడలో బీఎస్పీ ప్రచారం

**పావగడ, ఏప్రిల్ 19:** బీఎస్పీ చిత్రదుర్గ పార్లమెంటు అభ్యర్థి అశోకచక్రవర్తి తరపున ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరాయ ప్రచారం నిర్వహించారు. ఆయన శుక్రవారం తాలూకాలోని మంగళవాడ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి, ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు హనుమంతరాయ, వెంకటరమణ, మారుతీ, నరసింహమూర్తి, కెంచరాయ తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

**గోరంట్ల, ఏప్రిల్ 19:** పట్టణంలోని వినాయక నగర్‌లో ఉంటున్న రామాంజనమ్మ అనే మహిళ శుక్రవారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని గుంతపల్లికి రామాంజనప్ప 16 యేళ్లుగా గోరంట్లలోని వినాయక నగర్‌లో నివాసముంటున్నాడు. కార్పెంటర్‌గా పనిచేస్తూ ఒక్కగానొక్క కుమారైకు పెళ్లి చేశాడు. రామాంజనప్ప, రామాంజనమ్మ దంపతులు మాత్రమే ఉంటున్నారు. కుటుంబ కలహాల కారణంగా మనస్థాపం చెందిన రామాంజనమ్మ ఇంట్లో విషద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఇరుగుపొరుగువారు గుర్తించి ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషయంగా ఉండడంతో 108లో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

## ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజకు హాజరైన విద్యార్థులు

**రొళ్ల, ఏప్రిల్ 19:** మండలంలోని రత్నగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సరస్వతి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ తెలిపారు. పరీక్షలు రాసిన చిన్నారులకు ఉపాధ్యాయుల చేతులమీదుగాప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

- నాగరాజు యాదవ్ సోదరులు, జడ్పీటీసీ అనూషతోపాటు వెయ్యి మందికిపైగా...
- కండువా కప్పి ఆహ్వానించిన బాలకృష్ణ



మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్‌తో కలిసి టీడీపీ కండువాలు కప్పుకున్న నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్

**చిలమత్తూరు, ఏప్రిల్ 19:** ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో చిలమత్తూరు మండల వైసీపీ నాయకులు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, జడ్పీటీసీ అనూష, వైస్ ఎంపీపీ బయప్పతో పాటు వెయ్యి మందికి పైగా టీడీపీలో చేరారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఎమ్మెల్యే బాలకృష్ణ గురువారం హిందూపురం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం చిలమత్తూరులోని నాగరాజు యాదవ్ ఇంటికి వెళ్లారు. అక్కడ నాగరాజు యాదవ్, లక్ష్మీనారాయణయాదవ్‌తో సంప్రదింపులు జరిపి పార్టీలోకి ఆహ్వానించారు. వారితో పాటు వెయ్యిమందికిపైగా వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరారు. ఈ సమయంలో మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ బాలకృష్ణ వెంట ఉన్నారు. ఇక్బాల్ వర్గమంటూ వైసీపీ నాయకులు పక్కన పెట్టిన నాగరాజుయాదవ్ వర్గం మొత్తం బాలకృష్ణ సమక్షంలో టీడీపీలోకి చేరడం చిలమత్తూరు మండలంలో వైసీపీకి పెద్ద షాక్ అనే చెప్పవచ్చు. ఈ సందర్భంగా నాగరాజుయాదవ్, లక్ష్మీ నారాయణయాదవ్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గం బాగా అభివృద్ధి చెందుతోందని, ఆయనను మరో సారి ఎమ్మెల్యేగా గెలిపించుకో వాలన్న ఉద్దేశ్యంతో తాము వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు. ఇప్పటికే వైసీపీలోని కొందరు నాయకుల వైఖరితో ప్రజలు విసుగుపోయారని, త్వరలో ఆ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. ఈ ఎన్నికల్లో నంద మూరి బాలకృష్ణకు అత్యధిక మెజార్టీతో గెలిపించుకుం టామన్నారు. వైస్ ఎంపీపీ బయప్ప మాట్లాడుతూ తాను వైస్ ఎంపీపీ అయినా కనీస మర్యాద, గౌరవం లేదన్నారు. వైసీపీలో కేవలం బీసీ జపం తప్ప, బీసీలకు న్యాయం జరగలేదన్నారు. దీంతో తాము టీడీపీలో చేరా మన్నారు. ముందుగా ఎమ్మెల్యే బాలకృష్ణ చిలమత్తూరుకు వస్తున్నారని సమాచారం రావడంతో వేలాది మంది జనం నాగరాజు యాదవ్ ఇంటి వద్ద వేచి ఉన్నారు. బాలకృష్ణ అక్కడికి చేరుకోగానే యాదవ్ సోదరులు గజ మాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ జైబాలయ్య, జై టీడీపీ అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడున్న ప్రజలకు ఆయన అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, బేవనహళ్లి ఆనంద్, నాగరాజు, రంగారెడ్డి, మహమ్మద్ గౌస్, సోమశేఖర్, బేకరీ గంగాధర్ తదితరులు ఉన్నారు.



జడ్పీటీసీ అనూషకు టీడీపీ కండువా వేస్తున్న బాలయ్య

# సైకో ముఖ్యమంత్రిని సాగనంపుదాం: సవిత

**రొద్దం, ఏప్రిల్ 19 :** టీడీపీ నాయకుడిని, కార్యకర్తలను వేధిస్తూ... రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సాగనంపుదామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పిలుపునిచ్చారు. రొద్దం మండల పరిధిలోని తురకలాపట్నం, పెద్దిపల్లి, పాతర్లపల్లి, పెద్దకోడిపల్లి, లోచర్ల, బూచర్ల, కొత్తూరు, రాగిమేకలపల్లి, కంచిసముద్రం, కోగిర, ఎల్‌జీబీ నగర్ తదితర ప్రాంతాల్లో సవిత శుక్రవారం రోడ్‌షో చేపట్టారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోకి ప్రజలను నట్టేట ముంచారన్నారు. మద్యం, ఇసుక మైనింగ్‌లలో వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజల పేదరికాన్ని మార్చేస్తారన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు మాత్రమే కనబడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఊరూరా ఘనస్వాగతం లభించింది. తురకలాపట్నంలో యువ నాయకులు పూలహారంతో, మహిళలు హారతులతో స్వాగతం పలికారు. పాతర్లపల్లి, లోచర్ల, పెద్దకోడి పల్లి, రాగిమేకల పల్లి, కోగిర గ్రామాల్లో పెద్దఎత్తున పూలు చల్లుతూ సవితకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ



తురకలాపట్నంలో రోడ్‌షోలో పాల్గొన్న సవిత తదితరులు

నాయకులు జీవీపీనాయుడు, మాధవనాయుడు, చంద్రమౌళి, సుబ్బరత్నమ్మ, నరసింహులు, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, నరహరి, శ్రీనాథ్‌చౌదరి, తురకలాపట్నం యువ నాయకులు హరి, షన్ముఖ తదితరులు పాల్గొన్నారు.

**పలువురి చేరిక :** రొద్దం మండలంలోని వివిధ

### ఊరూరా ఘనస్వాగతం

గ్రామాల నుంచి పలువురు శుక్రవారం టీడీపీలో చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వారికి మండల కేంద్రంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పాతర్లపల్లి, బీదానిపల్లి, శ్యాపురానికి చెందిన వైసీపీ కార్యకర్తలు తిమ్మయ్య, క్యాతేనాయక్, సుగాలి లక్ష్మణ్ణ, నాగార్జున, కంబాలపల్లికి చెందిన పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్, శంకరప్ప, అంజి, సీసీ వెంకటరాముడు, మునిమడుగుకు చెందిన నీరుగంటి మల్లికార్జున, నీరుగంటి రామాంజి నేయులు, గంగాధర్, రామకృష్ణ, పెన్నక్కగారి నాగేంద్ర, పెన్నక్కగారి అంజనేయులు తదితరులు మునిమడుగు వెంకటరాముడు ఆధ్వర్యంలో చేరారు. అలాగే రాగిమేకలపల్లికి చెందిన మారుతిరెడ్డి, చాకలి ఆంజనేయులు, గుట్టూరుకు చెందిన వడ్డె అశోక్, వడ్డె నాగరాజు, వడ్డె అనీల్‌ను పార్టీలోకి ఆహ్వానించారు.

**పెనుకొండ టౌన్:** మండలంలోని వడ్డిపల్లి పంచాయతీ, రెడ్డిచెరువుకట్ట, కంబాలపల్లి, పెద్దకోడిపల్లి, పాతర్లపల్లి, బూచెర్ల, కొత్తూరు నుంచి సుమారు 50 కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం సవిత వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

## మంత్రిపై రెండు క్రిమినల్ కేసులు

### అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల వివరాలు

**హిందూపురం, ఏప్రిల్ 19:** వైసీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఉషశ్రీ చరణ్‌పై కళ్యాణదుర్గంలో రెండు క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మంత్రి ఉషశ్రీకి సంబంధించిన నామినేషన్ పత్రాల అఫిడెవిట్‌ను ఎన్నికల అధికారులు శుక్రవారం బహిర్గతం చేశారు. ఇందులో ఉషశ్రీ పేరుమీద బంగారం 5 కేజీల 27 గ్రాములు, వెండి 78 కిలోలు ఉంది. ఆస్తులకు సంబంధించి రూ.4,16,40,823 చరాస్తులు. సిరాస్థి రూ.1,06,52430. కొనుగోలు చేసిన స్థిరాస్తి రూ. 48,52,430. అప్పులు రూ. 13,27,43,932. అదే విధంగా ఆమె భర్త చరణ్‌రెడ్డికి సంబంధించి బంగారు. 1 కేజీ 607 గ్రాములు, వెండి 48 కేజీలు. చరాస్తులు రూ.7.02,51,090, సిర్థరాస్థి రూ. 28, 10, 92,855. కొనుగోలు చేసిన చరాస్తులు రూ.9,81,92,855, అప్పుల వివరాలు రూ.9,73,11,922,

**సవిత ఆస్తులు**

చరాస్తి: రూ.5,39,60767, స్థిరాస్తి రూ. 4,15,10,900. కొనుగోలు చేసిన చరాస్తులు రూ. 6,46,20,822, కాగా అప్పులు రూ.14,13,24,914 ఉన్నాయి. సవితపై 15 కేసులు ఉన్నాయి. అదే విధంగా ఆమె భర్త వెంకటేశ్వరరావుకు సంబంధించి చరాస్తులు రూ.78,04,950, స్థిరాస్తి రూ.12, 54,832, కనుగోలు చేసిన చరాస్తి రూ. 25, 00000, కాగా అప్పులు 1,02,85711 ఉన్నట్లు ఆమె అఫడవిట్‌లో పేర్కొన్నారు.

## సరిహద్దులో తనిఖీలు నిల్

### యథేచ్ఛగా కర్ణాటక మద్యం రవాణా



తనిఖీల సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న సరిహద్దు ప్రాంతం

**లేపాక్షి, ఏప్రిల్ 19:** సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతుండటంతో కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. లేపాక్షి మండలంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతం వద్ద తనిఖీలు చేయాల్సిన సిబ్బంది సరిహద్దులో ఉండడంలేదు. దీంతో ఇటు కర్ణాటక మద్యం యథేచ్ఛగా తరలివస్తోందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. సెబ్ అధికారులు కంచిసముద్రం వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించగా అధిక మొత్తంలో కర్ణాటక మద్యం పట్టుబడింది. సరిహద్దులో తనిఖీలు చేయాల్సిన సిబ్బంది గురువారం అక్కడ కనిపించలేదు. దీంతో సరిహద్దు ప్రాంతం నిర్మానుష్యంగా మారడంతో అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించాయి. ఈదారిగుండా చిలమత్తూరు, గోరంట్ల కొత్తచెరువు వరకు కర్ణాటక మద్యం సరఫరా జోరుగా సాగుతున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల సమయంలో కూడా సిబ్బంది లేకపోవడం పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## బాలయ్య నామినేషన్‌కు తరలిన తెలుగు తమ్ముళ్లు



లేపాక్షి నుంచి నామినేషన్‌కు బయలుదేరిన టీడీపీ శ్రేణులు

**లేపాక్షి, ఏప్రిల్ 19:** సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీ హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమానికి లేపాక్షి మండలం నుంచి తెలుగు తమ్ము ళ్లు, ఆడపడుచులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల్లో బయలుదేరి వెళ్లారు. హిందూపురంలో సూగూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి ర్యాలీ ఉండటంతో తెలుగు తమ్ముళ్లు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.



కనిశెట్టిపల్లి నుంచి బయలుదేరిన టీడీపీ శ్రేణులు

**చిలమత్తూరు:** నందమూరి బాలకృష్ణ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హిందూపురం తరలి వెళ్లారు. జై బాలయ్య, జై టీడీపీ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా కదిలారు. వృద్ధులు, చిన్నారులు సైతం బాలయ్యపై అభిమానంతో తరలివెళ్లడం చూస్తే బాలయ్యకు ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ ఖాయమని పలువురు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరువే..!

### కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌డీ కుమారస్వామి

**పావగడ, ఏప్రిల్ 19:** రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశంలో కూడా అధికారం చేపడితే ఖచ్చితం గా ప్రజలకు కరువు ఉచితంగా లభిస్తుందని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఎద్దేవచేశా రు. ఆయన శుక్రవారం పావగడ ఎస్ఎస్‌కే రంగమందిరంలో నిర్వహించిన బీజేపీ-జేడీఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రతి నెలా రూ. లక్షల కోట్లు అప్పులు చేస్తోందని విమర్శించారు. దీనివల్ల ఒక్కొక్క వ్యక్తిపై ఇప్పటికే రూ.36వేల అప్పు చూపిస్తోందన్నారు. రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండడానికి, దేశ భద్రతకు బీజేపీకి అధికారం కట్టబెట్టాలని పేర్కొన్నారు. తద్వారా నరేంద్రమోదీని ముచ్చటగా మూడోసారి ప్రధానిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ, జేడీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం



నీలకంఠేశ్వరుడి రథోత్సవం

**మడకశిర రూరల్, ఏప్రిల్ 19:** మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. వేదపండితులు ఆలయంలోని స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మోసుకొని వచ్చి రథంపై ఆశీసులను చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగారు. రథోత్సవం ఎదుట మహిళలు నిర్వహించిన కోలాటం లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొని ఎంతో ఉత్సహంగా కోలాటం ఆడారు. అదే విధంగా తప్పెట్లు వాయించి అందరినీ ఆనందింపజేశారు. రథోత్సవంలో రఘువీరారెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



కోలాటం ఆడుతున్న రఘువీరారెడ్డి

## ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

### సబ్ కలెక్టర్ అపూర్వభరత్



ఎంపీడీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్, ఎన్నికల పరిశీలకుడు బీవీ నాయక్

**పెనుకొండ రూరల్, ఏప్రిల్ 19:** ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సబ్ కలెక్టర్ అపూర్వభరత్, ఎన్నికల పరిశీలకుడు బీవీ నాయక్ ఎన్నికల బృందాలకు సూచించారు. వారు శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గంలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఏఈఓ, అకౌంట్స్ బృందంతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విధులకు సబంధించి సకాలంలో నివేదికలు అందించాలని బృందాలను ఆదేశించారు. ఏవైనా సందేహాలుంటే ఫిర్యాదు కోసం ఫోన్ నం. 9059417612కు సంప్రదించాలన్నారు.

## ఎన్నికలకు గట్టి బందోబస్తు: డీఎస్పీ

**పెనుకొండ టౌన్, ఏప్రిల్ 19 :** సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ బాజీజాన్‌సైద పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సబ్‌డివిజన్ పరిధిలో పెనుకొండ, మడకశిర రెండు నియోజకవర్గాలు వస్తాయని తెలిపారు. వాటిలో 356గ్రామాలున్నాయని ఇందు లో 506 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆ రెండు నియోజకవర్గాల్లో 69 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహించి, కార్డెన్‌సర్చ్ చేశామన్నారు. దాదాపు 3.30లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు నిర్వహించుకునేలా పోలింగ్ బూత్‌ల వద్ద కట్టుదిట్ట మైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## చంద్రబాబును సీఎంగా చూడాలన్నదే లక్ష్యం: గుండుమల

**మడకశిరటౌన్, ఏప్రిల్ 19:** వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా మార్చిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. ఇటువంటి గడ్డు పరిస్థితిల్లో రాష్ట్రాన్ని నడిపించే ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడే అన్నారు. కావున చంద్రబా బును ముఖ్యమంత్రిగా చూడాలన్నదే మనందరి లక్ష్యమన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిం చారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజును స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినట్లు పార్టీ అధిష్టానం సమాచారం అందించిందని, ఆయన శనివారం మడకశిరలో పర్యటిస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొనాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ నిర్ణయమే శిరోధార్యమని, వారు సూచించిన మేరకు నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, మంజునాథ్, ఆర్ జయకుమార్, భక్తర్, రామాంజనేయులు, గురుమూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్, మద్దనకుంటప్ప, దాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయాధికారికి ఘనంగా వీడ్కోలు

**పెనుకొండ, ఏప్రిల్ 19:** స్థానిక సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న శంకర్‌రావు బదిలీ అయ్యారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బదిలీ అయిన న్యాయాధికారికి ఘనంగా వీడ్కోలుసభ ఏర్పాటు చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు శంకర్‌రావుకు పూలమాలలువేసి, శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. సీనియర్ న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌నాయక్, శరత్‌బాబు, అశ్వత్థనారాయణ, రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం

**గోరంట్ల, ఏప్రిల్ 19:** పట్టణంలోని ప్రధాన రహదారిపై కొబ్బరి బొండాలు విక్రయించే దుకాణం వద్ద కూర్చున్న 17 యేళ్ల కళాశాల విద్యార్థి అదృశ్యమైనట్లు కేసు నమోదైందని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఓడీసీ మండలానికి చెందిన ఓ విద్యార్థిని ఓడీసీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి చాలా కాలంగా గోరంట్లలో కొబ్బరి బోండాలు వి క్రయించే వ్యాపారం చేస్తున్నాడు. చదువుకు సంబంధించిన సామగ్రి కోసం గోరంట్లలోని తండ్రి వద్దకు విద్యార్థిని శుక్రవారం వచ్చింది. అతడు తన దుకాణంలో కుమార్తెను ఉంచి, అవసరమైన వస్తువులు కొనుగో లు చేసేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి దుకాణంలో కుమార్తె కనిపించలేదు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.